ప్రజాశక్తి

ఆదివారం 5 నవంబర్ 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

ఆరుగురు బిఎల్ఒల సస్పెన్షన్

- ఎన్నికల విధులలో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు
- కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న ఆరుగురు బూత్ స్థాయి అధికారులను (బిఎల్ఒ) కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ సస్పెండ్ చేశారు. వీరిలో ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో నలుగురు, సంతనూతలపాడు నియోజకవర్గంలో ఇద్దరు ఉన్నారు. పిఎస్ ఒంగోలు దేవుడుచెరువు సచివాలయంలో వెల్ఫేర్, డెవలప్‌మెంట్ సెక్రటరీగా పనిచేస్తున్న మేడూరి రామారావు(పోలింగ్ కేంద్రం నెంబర్ 175), అదే సచివాలయంలో మహిళా పోలీస్‌గా పనిచేస్తున్న యాస్మిన్ బేగం(పిఎస్ నెంబర్ 175), సత్యనారాయణపురం సచివాలయంలో ఉమెన్, వీకర్ సెక్షన్ ప్రొటెక్షన్ సెక్రటరీగా పనిచేస్తున్న ఏ.ఎస్తేర్ రాణి(పిఎస్ నెంబర్ 60), గాంధీనగర్ సచివాలయంలో వెల్ఫేర్, డెవలప్‌మెంట్ సెక్రటరీగా పనిచేస్తున్న డి.హనుమంతరావు(పిఎస్ నెంబర్ 88)ను సస్పెండ్ చేశారు. అదేవిధంగా మిగతా ఇద్దరు సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాగులుప్పలపాడు మండం హెచ్.నిడమానూరులో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వై.శ్రీలక్ష్మి(పిఎస్ నెబర్ 188), చీమకుర్తి మండలం చినరావిపాడులో వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.అపర్ణ (పిఎస్ నెంబర్ 57)సస్పెండ్ అయిన వారిలో ఉన్నారు. వీరంతా సచివాలయ ఉద్యోగులు. ఇటీవల నిర్వహించిన ఇంటింటి సర్వే ప్రక్రియలో వీరు నిర్లక్ష్యంగా ▶ 2లో

అద్దంకిలో ప్రజారక్షణభేరి కరపత్రాలను అందజేస్తున్న సిపిఎం నేతలు

ప్రజారక్షణ భేరి కరపత్రాలు పంపిణీ

▶ 4లో

రబీపైనా ఆశలు ఆవిరి..!

- రైతులను కుంగదీసిన అత్యల్ప వర్షపాతం
- ఖరీఫ్‌లో తగ్గిపోయిన సాగు విస్తీర్ణం
- దిక్కుతోచని స్థితిలో జిల్లా రైతాంగం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఈ ఏడాది వ్యవసాయ సీజన్‌లో రైతులు ఏరువాక పట్టి పొలం సాగుకు సన్నద్ధమయ్యారే తప్ప బాపట్ల జిల్లా రైతులకు ఖరీఫ్ సేద్యం ఏ మాత్రం అనుకూలించిన పరిస్థితి లేదు. జిల్లాలో మాగాణి సాగుకు ప్రధాన వనరుగా ఉన్న కొమ్మమూరు కాలువకు సరిపడా నీరు రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ముందు చూపుతో వ్యవహరించలేదు. అటు పులిచింతల ఇటు పట్టిసీమ నుంచి సాగునీరు రప్పించడంలో విఫలమయింది. దీంతో ఖరీఫ్‌లో 45,820 హెక్టార్లలో పంటల సాగు నిలచిపోయింది. రబీ సీజన్ ప్రారంభం అయినప్పటికీ వర్షాలు కురిసే జాడ కనిపించడం లేదు. దీంతో రబీపై కూడా రైతులు ఆశలు వదులు కుంటున్న పరిస్థితి జిల్లాలో నెలకొంది.

సాగునీరందక బీటలు వారిన వరి పైరు

జిల్లాలో ఖరీఫ్‌లో లక్షా 9 వేల 169 హెక్టార్లకు గానూ 86,385 హెక్టార్లలో మాత్రమే వరిపైరు సాగయింది. మొత్తంగా ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 1,53,136 హెక్టార్లు కాగా 1,07,316 హెక్టార్లలో మాత్రమే పంటల సాగు సాధ్యపడింది. అంటే 45,820 హెక్టార్లలో పంటలసాగు నిలిచిపోయింది. రబీ సీజన్ ప్రారంభం అయినప్పటికీ వర్షాలు కురిసే జాడ కనిపించకపోవడంతో రబీపై కూడా రైతులు ఆశలు వదులుకుంటున్న పరిస్థితి జిల్లాలో నెలకొంది. రబీలో సాధారణ సాగు విస్తీర్ణం 1,56,607 హెక్టార్లు కాగా ఇప్పటివరకు 181 హెక్టార్లలోనే పంటల సాగు జరిగింది. వర్షాలు కురవక ఆరుతడి పంటలకు కూడా నీరు లభించే ఆశలు లేకపోవడంతో జిల్లా రైతాంగం దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో జల వనరుల శాఖ అధికారులు సమావేశం జరిపి కృష్ణా పశ్చిమ డెల్టాలో వరి పంట సాగు కోసం వార్షిక ప్రణాళికను రూపొందించింది. ఈ మేరకు 67 టి.ఎం.సిల నీరు పంటల సాగు కోసం విడుదలకు ప్రభుత్వం ఆమోదించడం జరిగింది. జూన్‌లోనే ఈ ఏడాది మూడు పంటలు సాగు చేసుకోండని చెబుతూ మంత్రి పంట కాలువలకు నీరు విడుదల చేశారు. కానీ ఆ నీటితో మంచినీటి అవసరాలు తీరాయి తప్ప పంటల సాగుకు సరిపడా నీరు లేకపోయింది. జూన్, జూలై నెలల్లో కొద్దిపాటి వర్షాలు కురిశాయి. కానీ ఆగస్టు నెలలో గతంలో ఎన్నడూ లేని రీతిలో వర్షం అనేది లేకపోయింది. మాగాణి సాగు ముమ్మరం కావాల్సిన ఆగస్టులో వర్షాలు పడక పోవడంతో రైతాంగం తమ వ్యవసాయ పనులు నిలుపుదల చేయాల్సి వచ్చింది. దుక్కులు దున్ని వరినార్లు పోసే సమయంలో వర్షాలు లేక జిల్లాలోని భట్టిప్రోలు, రేపల్లె వ్యవసాయ డివిజన్ల పరిధిలో కొందరు రైతులు ఎద పద్ధతిలో వరిసాగుకు సిద్ధపడ్డారు. కొందరు రైతులు కొన్ని చోట్ల వరి నార్లు పోసి నాట్లు వేసేందుకు సిద్ధపడ్డారు. జిల్లాలో కృష్ణా పశ్చిమ కాలువ ▶ 2లో

తప్పుడు ప్రచారం మానుకోండి..

- నకిలీ, ఫోర్జరీ డాక్యుమెంట్ల విషయంలో నిజానిజాలు తెలిశాయి.!
- బాలినేనిపై బురద జల్లేందుకు టీడీపీ ప్రయత్నం
- వాస్తవాలు బయటపడ్డాక అభాసుపాలైన టీడీపీ నేతలు
- మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-ఒంగోలు

ఒంగోలులో ఇటీవల వెలుగులోకి వచ్చిన నకిలీ స్టాంపులు, ఫోర్జరీ డాక్యుమెంట్ల విషయంలో నిందితులు దొరకటం, పోలీసులు వేగంగా దర్యాప్తు చేయటంతో నిజానిజాలు బయటకు రావటం జరిగిందని, ఇకనైనా తప్పుడు ప్రచారం మానుకోవాలని రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏదో ఒక విషయం వెలుగులోకి రాగానే దానిని అధికార పార్టీకి అంటగట్టి రాజకీయాలు చేయాలని చూడటం టీడీపీ నాయకులకు అలవాటని అన్నారు. అందులో భాగంగానే ఈ వివాదంలోకి మాజీ మంత్రి, సీనియర్ నాయకులు బాలినేని శ్రీనివాసరెడ్డిని లాగాలని టీడీపీ నేతలు భావించారని, ఇందులో బాలినేని పాత్ర ఉందంటూ ఆరోపణలు చేసి వారికి అనుకూల మీడియాతో తప్పుడు ప్రచారానికి తెర లేపారని చెప్పారు. కానీ తన సుధీర్ఘ రాజకీయ జీవితంలో మచ్చ లేని నాయకుడిగా తన ప్రస్థానాన్ని సాగిస్తున్న బాలినేని ఈ వ్యవహారంపై విచారణ జరపాలని స్వయంగా తానే పోలీసులను కోరటం జరిగిందన్నారు. సిట్ ఏర్పాటు చేయటం ఇప్పటికే 38 మందిని అరెస్ట్ చేయటం జరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ మల్లికా గర్గ్, కలెక్టర్ దినేష్ కుమార్‌లు జరిగిన ఉదంతం అంతా మీడియాకు వివరించి ఇందులో బాలినేనిది గానీ, వారి కుటుంబ సభ్యుల పాత్ర కానీ లేదని చెప్పటంతో బాలినేని నిజాయితీ నిరూపితమైనదని మంత్రి చెప్పారు. బాలినేని లాంటి వ్యక్తిపై తప్పుడు ఆరోపణలు చేసి టీడీపీ అభాసుపాలయిందని, నిలకడగా అయినా నిజాలు బయటకు వస్తాయని మరోమారు రుజువైందని మంత్రి వివరించారు.

ఫారం-7పై పోలీసు విచారణ

- బృందాలుగా ఇళ్లకు వెళ్లి పరిశీలిస్తున్న పోలీసులు
- 17 కేసులకు సంబంధించి ఓటర్ల వివరాలు తెలుసుకుంటున్న వైనం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పర్చూరు నియోజకవర్గంలోని పోలీసు అధికార యంత్రాంగం యావత్తూ ఫారం-7 దరఖాస్తుల విచారణ కోసం బృందాలుగా గ్రామాల బాట పట్టారు. ఇప్పటివరకు ఫారం-7 నకిలీ దరఖాస్తులకు 17 కేసులు నమోదు చేశారు. వీటికి సంబంధించి స్థానికంగా ఉన్న పోలీసులతో పాటు ఇప్పటికే వీఆర్‌లో ఉన్న పలువురు పోలీసు అధికారుల ఆధ్వర్యంలో విచారణ జరుగుతోంది. పర్చూరు ఓటర్ల సవరణ జాబితా, ఫారం-7 దరఖాస్తుల విచారణ ప్రస్తుతం రాష్ట్రస్థాయి అంశం అయిన క్రమంలో పోలీస్ అధికారులు ఆచీతూచీ విచారణ చేస్తున్నారు.

విచారణ చేస్తున్న పోలీసులు

బాపట్ల జిల్లాలో గత జూలై నుంచి ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం చేపట్టారు. పర్చూరులో 40 వేల దొంగ ఓట్లు ఉన్నాయని, గ్రామాల వారీగా ఉన్న దొంగ ఓట్లను తాము గుర్తించామని ప్రకటించిన అధికార వైసిపి నేతలు గ్రామాల వారీగా టిడిపికి చెందిన వారి ఓట్లను తొలగించేందుకు అనుయాయులతో ఫారం-7 దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేశారు. ఇలా పర్చూరులో ఫారం-7 దరఖాస్తులు 14 వేలకు పైగా వచ్చాయి. ఒక వ్యక్తి ఓటు తొలగింపు కోరుతూ ఐదు దరఖాస్తుల వరకు పెట్టుకునే అవకాశం ఉంది. కానీ పర్చూరులో ఒక్కొక్కరూ 20 నుంచి 291 ఓట్ల వరకు తొలగింపు కోరుతూ గంపగుత్తగా ఫారం-7 ధరఖాస్తులిచ్చారు. దొంగ ఓట్ల పేరుతో పర్చూరులో ప్రతిపక్షాలకు చెందిన ఓట్లను తొలగించేందుకు జరుగుతున్న కుట్రలను గ్రహించిన పర్చూరు టిడిపి శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. సరైన రీతిలో స్పందన రాకపోవడంతో హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. దీంతో విచారణకు కదిలిన ఎన్నికల అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్న క్రమంలో పర్చూరు, మార్టూరు, యద్దనపూడి, ఇంకొల్లు, కారంచేడు, చినగంజాం మండలాల్లో రెండు, మూడు చొప్పున మొత్తం 17 కేసుల వరకు పోలీసులు నమోదు చేశారు. ఎన్నికల నిబంధనల మేరకు పర్చూరు నియోజకవర్గంలో తప్పుడు సమాచారంతో ఫారం-7 దరఖాస్తులు చేసిన వారిలో కనీసం 124 మందిపై కేసులు నమోదు చేయాల్సి ఉంది. పర్చూరులో తప్పుగా ఫారం-7 దరఖాస్తు చేసిన వారు బతికి ఉన్న ▶ 2లో

వైసిపి ప్రభుత్వానికి

కౌంట్‌డౌన్ మొదలైంది..

- టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల
- ఉలిచిలో జనం 'కోసం జనార్ధన్' ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిస్తున్న వైసిపి ప్రభుత్వానికి కౌంట్ డౌన్ ప్రారంభమైందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధనరావు పేర్కొన్నారు. టిడిపి అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు జనం కోసం జనార్ధన్, బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమం శనివారం ఒంగోలు మండలం, ఉలిచి గ్రామంలో అట్టహాసంగా ప్రారంభమైంది. తొలుత జనార్ధన్‌రావు ఉలిచి గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం 'జనం కోసం జనార్ధన్', 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకి గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా దామచర్ల జనార్ధనరావు ఇంటింటికీ వెళ్లి భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలు, గత ప్రభుత్వంలో అభివృద్ధి చేసిన ▶ 2లో

కరపత్రాలు అందజేస్తున్న దామచర్ల జనార్ధన్

రబీపైనా ఆశలు ఆవిరి.!

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా కొంత మేర సాగు నీరు విడుదల అవుతున్నందున కొంత మేర వరినాట్లు వేశారు. కానీ ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు కృష్ణా కాలువ ఆ దిగువన ఉన్న కొమ్మమూరు కాలువ ద్వారా సరిపడా సాగు నీరు రానందున వరి సాగు నిలిచిపోయింది. జిల్లాలో కొమ్మమూరు కాలువ దుగ్గిరాల లాకుల నుంచి దిగువకు పంట కాలువల ద్వారా సాగు నీరు వచ్చే పరిస్థితి లేకపోవడంతో బాపట్ల, చీరాల, చినగంజాం ప్రాంతాల్లో లక్ష ఎకరాల్లో వరిసాగు ప్రశ్నార్థకమైంది. వర్షాలు సక్రమంగా పడకపోవడం, పంట కాలువలకు సరిపడా నీరు చేరక పోవడంతో వరిసాగుకు సిద్ధపడాలా లేక ఆరుతడి పంటలు వేసుకోవాలా.? అన్న సందిగ్ధంలో ఉన్న రైతులు ధైర్యం చేసి వరినార్లు పోశారు, కొందరు నాట్లు వేశారు. కానీ సెప్టెంబరులో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే కొద్దిపాటి వర్షాలు పడ్డాయి. అక్టోబరులో చుక్క వర్షం కూడా పడలేదు. ఈ కారణంగా జిల్లాలో దాదాపు 60 వేల ఎకరాల్లో వరిపైర్లకు సాగునీరందక ఎండుముఖం పట్టాయి. ఆయిల్ ఇంజన్ల ద్వారా సాగునీరందించేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. కానీ పంటకాలువల్లో నీరు లేకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అధికారులు వారాబందీ విధానంలో సాగు నీరు అందిస్తామని చెబుతున్నారు తప్ప తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేసే ప్రయత్నాలు ఆచరణలో లేవు. కొమ్మమూరు కాలువతో పాటు ప్రధానమైన ఐదు కాల్వల ద్వారా ఆయకట్టు భూములకు సాగునీరు చేరాలి. ఈ ఏడాది కూడా పంట కాలువలకు సక్రమంగా మరమ్మత్తులు జరగకపోవడంతో వచ్చిన కొద్దిపాటి నీరు ఆయకట్టు చివర భూములకు చేరే పరిస్థితి లేదు. జిల్లాలోని పంటకాలువలకు 66 ప్రాంతాల్లో మరమ్మతులు చేయడానికి రూ.6.8 కోట్ల నిధులు మంజూరయ్యాయి. నామినేషన్ పద్ధతిలో కొన్ని, టెండర్ విధానంలో కొన్ని పనులు చేపట్టారు. కానీ ఎక్కడా కూడా పనులు సక్రమంగా జరిగింది లేదు. పంట కాలువల్లో పూడికలు, గుర్రపు డెక్క తొలగించని కారణంగా నీటిపారుదల సక్రమంగా లేకపోయింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాలు పడకముందే అన్ని పంటకాలువల, మురుగు కాలువల మరమ్మతు పనులు పూర్తి చేస్తేనే పంట పొలాలకు సక్రమంగా సాగునీరందడం సాధ్యపడుతుంది. ఇప్పటికయినా రాష్ట ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొని పులిచింతల, పట్టిసీమ నుంచి సాగునీరు రప్పించి వారబందీ విధానాన్ని పట్టిష్టంగా అమలు చేసి ఎండుముఖం పట్టిన వరిపంటను రక్షించాల్సి ఉంది.

పూర్తిస్థాయిలో సాగునీరు రప్పించాలి

సిహెచ్ గంగయ్య, సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి

కొమ్మమూరు కాలువ చివరి భూముల వరకు సాగునీరందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం పట్టిసీమ, పులిచింతల నుంచి పూర్తిస్థాయిలో నీరు కాలువకు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. సాగునీరు రప్పించడంతో పాటు వారబందీ విధానాన్ని సక్రమంగా అమలు చేస్తూ పంటలకు నీరందించాలి. ఇప్పటికే సాగునీరు లేక ఎండిపోయిన వరి పైర్లను పరిశీలన జరిపి, పంట నష్టం అంచనాలు రూపొందించి రైతులకు నష్టపరిహారం అందించాలి.

సాగు నీరందకపోతే ఆత్మహత్యే శరణ్యం

గోరంట్ల వెంకటేశ్వర్లు, కారంచేడు గ్రామ రైతు

కారంచేడు గ్రామంలో కౌలుకు తీసుకుని ఆరు ఎకరాలు వరిపైరు సాగు చేశా.. ప్రస్తుతం రెండు నెలల పైరు పొట్టపోసుకునే దశలో ఉంది. కొమ్మమూరు కాలువలో నీరు అడుగంటడంతో ఇంజన్ల ద్వారా నీరు ఎత్తిపోస్తున్నాం. ఎకరాకు రూ.4 వేలు నీటి ఖర్చు అవుతుంది. ఇప్పటివరకు సాగు ఖర్చు రూ.24 వేలు అయింది. ప్రస్తుతం ఇంజన్ల ద్వారా ఎత్తిపోసేందుకు కూడా కాలువలో నీరు లేదు. ఇంకో 10 రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే ఆత్మహత్యే శరణ్యం.

రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న

బిజెపి ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించండి

7న కొండపికి విచ్చేస్తున్న సిపిఎం బస్ జాతాను జయప్రదం చేయండి: సిపిఎం

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కూలీలు

ప్రజాశక్తి-కొండపి

రాష్ట్ర ప్రజలకు తీరని ద్రోహం చేసిన బిజెపి విధానాలను ప్రతిఘటించేందుకు, ప్రజా సమస్యల్ని ఎజెండా చేసేందుకు నవంబర్ 15న విజయవాడలో ప్రజా రక్షణ భేరి సభను నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు అన్నారు. ఇందుకు సంబంధించిన గోడ ప్రతికలను శనివారం పెరిదేపి పంట పొలాల్లో రైతు కూలీల చేత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇస్తామని బిజెపి మోసం చేసి, విభజన చట్టంలోని హామీలన్నీ తుంగలో తొక్కిందని అన్నారు. రాజధాని నిర్మాణానికి నిధులు ఇవ్వలేదని, జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రజల హక్కులకు భంగం కలిగిస్తున్న బిజెపి విధానాలను రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపిలు సమర్ధించటం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్ర ప్రజలకు బిజెపి ఏం చేసిందని వీరు సమర్థిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రజల్ని మాయచేసి, మభ్యపుచ్చి ఎన్నికల్లో గెలిచిన బిజెపి ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా 32 మంది ప్రజల రక్త తర్పణతో స్థాపించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అడ్డగోలుగా అమ్మేందుకు సిద్ధమవుతోందని అన్నారు. కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణాన్ని విస్మరించిందని అన్నారు. ఇటువంటి ప్రజా సమస్యలను ప్రశ్నించకపోగా బిజెపికి భజన చేస్తున్న అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలను ప్రజలు ప్రశ్నించాలని, ప్రజా సమస్యలను ఎజెండా చేసేందుకు సిపిఎం ప్రజారక్షణ బేరిసభను నిర్వహిస్తున్నదని తెలిపారు. ఆ సభ జయప్రధాన్ని కోరుతూ కర్నూలు జిల్లా ఆధోనిలో ప్రారంభమైన రాష్ట్ర స్థాయి బస్సు జాత నవంబర్ 7వ తేదీన కొండపికి విచ్చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమాలు జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సిపిఎం మండల కార్యదర్శి కేజి మస్తాన్ మాట్లాడుతూ ప్రజా రక్షణ భేరి సభల సందర్భంగా ప్రజాప్రణాళికను రూపొందించామని, దాన్ని నియోజకవర్గమంతా విస్తృతంగా ప్రచారం చేస్తామని తెలిపారు. 7వ తేదీన కొండపి నియోజకవర్గానికి విచ్చేస్తున్న సిపిఎం రాష్ట్రస్థాయి బస్సు యాత్ర జరుగుమల్లి మండలం చిరికూరపాడుకు ఉదయం 8 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. అక్కడ స్వాగతం పలికి ద్విచక్ర వాహనాల ర్యాలీతో కొండపి బస్టాండ్ సెంటర్ వరకు వస్తుందని, 9 గంటలకు అక్కడ సభ జరుగుతుందని తెలిపారు. ఈ జాతాను ప్రజలు జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు అంగలకుర్తి బ్రహ్మయ్య, మల్లెల కొండయ్య, గడ్డం వందనం, ముప్పరాజు చిన్నబ్రహ్మయ్య, మల్లెల పెద్దపేతురు, ఎం నిర్మల, ఏ ఆదాం, ఎల్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఫారం-7పై పోలీసు విచారణ

(మొదటిపేజీ తరువాయి)

వారిని కూడా చనిపోయినట్లు పేర్కొంటూ దరఖాస్తు చేశారు. స్థానికంగా గ్రామంలో ఉంటూ నెలనెలా వేలిముద్ర వేసి రేషన్ తీసుకుంటున్న వారిని కూడా ఇక్కడ లేనట్లుగా దరఖాస్తు చేశారు. అలానే చనిపోయిన వారి పేరుతో కూడా ఫారం-7 దరఖాస్తు చేశారు. కానీ ఎన్నికల కమిషన్, కోర్టుల జోక్యంలో కథ అడ్డం తిరిగినట్లయింది.

పర్చూరులో ఇలా దరఖాస్తు చేసిన వారందరూ అధికార వైసిపికి చెందిన వారు కావడంతో అధికారులకు ఎలా ముందుకెళ్లాలో.. అనేది ఇబ్బందికరంగా మారింది. పెట్టిన 17 కేసుల్లో కూడా పురోగతి లేదు. దీంతో ఎమ్మెల్యే ఏలూరి మరోసారి ఎన్నికల కమిషన్ మరియు కోర్టులను ఆశ్రయించారు. ఇప్పటికే అధికార పార్టీ నేత మాట విని.. మార్టూరు సిఐ టి ఫిరోజ్, ఎస్ఐలు ఎన్‌సి ప్రసాద్, కె కమలాకర్, కె అనూక్ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ క్రమంలో పోలీసుపరంగా తగిన చర్యలు తీసుకోకపోతే ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉన్నందున పోలీసు అధికారులు బృందాలను ఏర్పాటు చేసి.. ఫారం-7 దరఖాస్తుల విచారణ చేపట్టారు. చీరాల, బాపట్ల డిఎస్‌పిల పర్యవేక్షణలో సిఐలు, ఎస్ఐలు పోలీస్ సిబ్బంది శుక్రవారం నుంచి బృందాలుగా ఏర్పడి విచారణ చేపట్టారు. ఫారం-7 దరఖాస్తుల్లో పేర్కొన్న వారి ఇళ్ళకు వెళ్ళి సదరు ఓటర్లు గ్రామంలో ఉంటున్నారా..? లేదా.? చనిపోయారా..? అన్న విషయాల గురించి విచారణ జరుపుతున్నారు. ఎప్పటి నుంచి స్థానికంగా ఉంటున్నారే తెలుసుకొని వారి నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేస్తున్నారు. బతికి ఉన్నవారిని కూడా చనిపోయినట్లుగా ఫారం-7 ధరఖాస్తులు ఉన్న క్రమంలో ఇలాంటి మూడు కేసులను సిఐ స్థాయి అధికారులు విచారణ జరిపినట్లు తెలిసింది. ఇప్పటి వరకు పలు స్టేషన్ల పరిధిలో నమోదు అయిన 17 కేసులకు సంబంధించి సుమారు 1500 వరకు ధరఖాస్తులు ఉన్న క్రమంలో పోలీసు బృందాలు సదరు గృహాలకు ప్రత్యక్షంగా వెళ్లి విచారణ చేస్తున్నారు. ఈ విచారణలో ఏమాత్రం తేడా వచ్చినా తమకు ఇబ్బందులు తప్పవని ఇప్పటికే గ్రహించిన పోలీసు యంత్రాంగం ప్రతి ధరఖాస్తును క్షుణంగా పరిశీలిస్తున్నారు.రానున్న రోజుల్లో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మరి కొన్ని కేసులు నమోదు అయ్యే పరిస్థితి ఉందని చెబుతున్నారు.

ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-సిఎస్‌పురం: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కనిగిరి ఆర్డీవో జాన్ ఇర్విన్ తెలిపారు. సిఎస్ పురంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఓటు హక్కు నమోదు కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయో బిఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలని వారికి సూచించారు. డబుల్ ఎంట్రీలు ఉంటే వాటిని గుర్తించి తీసివేయాలని తెలిపారు. ఆయన వెంట తహశీల్దారు షేక్ నాగులు మీరా, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

ఆరుగురు బిఎల్‌ఒల సస్పెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

వ్యవహరించారని, క్లెయిమ్స్‌ను పరిష్కరించడంలోనూ అశ్రద్ధ చూపారని ఒంగోలు సంతనూతలపాడు సహాయ రిటర్నింగ్ అధికారులు నివేదిక ఇవ్వడంతో వీరిని కలెక్టర్ సస్పెండ్ చేశారు. వచ్చే సాధారణ ఎన్నికలను ఎలాంటి లోపాలు లేకుండా పకడ్బందీగా నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని, ఎన్నికలకు సంబంధించిన విధులలో పాల్గొనే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

కౌంట్‌డౌన్ మొదలైంది..

(మొదటిపేజీ తరువాయి)

పనుల కరపత్రాలను పంపిణీ చేశారు. జగన్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ జగన్ పాలనలో సర్వనాశనమైన రాష్ట్రం యథాస్థితికి చేరుకోవాలంటే తెలుగుదేశం పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాల్సిందేనని పిలుపునిచ్చారు. ఆధారాలు లేని కేసుల్లో చంద్రబాబును జైల్లో ఉంచి జగన్ రాక్షసానందం పొందారని, రాష్ట్ర ప్రజలంతా ఈ విషయాన్ని ఖండించారన్నారు. బెయిల్‌పై వచ్చిన బాబుకు ప్రజలు కనీవినీ ఎరుగని రీతిలో నీరాజనం పలికారన్నారు. ఉలిచి గ్రామంలో వైసిపి ప్రభుత్వ విధానాలతో విసుగు చెంది శనివారం ఆ పార్టీని వీడి సుమారుగా 30 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ పోలవరపు వెంకటరామయ్య, కామేపల్లి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు నల్లమోతు గంగాధర్, రాష్ట్ర బిసి సాధికారత కమిటీ కమిటీ సభ్యులు పిలుట్ల సుధాకరరావు, యూనిట్ ఇన్‌చార్జి యర్రంనేని నరసింహారావు పాల్గొన్నారు.

నోటీసు

శ్రీ దరిశి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

O.S.No.81/2021

కోటా అయ్యవీరయ్య @ వీరయ్య ... వాది

V.s.,

కొర్రపాటి వెంకట ప్రసాదు ..ప్రతివాది

To

కొర్రపాటి వెంకట ప్రసాదు S/o.వెంకట రామయ్య, గుంటూరు ప్రస్తుత నివాసం కొర్రపాటివారిపాలెం గ్రామం, తాళ్ళూరు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు వాది దావ పరిహారము కోరి మీపై దావా దాఖలు చేసి ఉన్నారు. కనుక మీకు ఏమైన అక్షేపణలు ఉన్నచో తే.17-11-23 ది ఉదయం గం॥10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకొనవలెను. లేకున్న మీకు పరోక్షముగా తీర్మానం కాబడును.

వాయిదా తేది : 17-11-2023

దరిశి
తేది : 05-11-2023

వడ్డమాని శ్రీనివాసశాస్త్రి,
అడ్వకేట్,
దరిశి, సెల్ : 94401 09385

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు ఒంగోలు

H.M.O.P NO.21/2023

Between

రావినూతల ఆదాము ... పిటిషనర్

మరియు

1.రావినూతల అంజలి
2.డోలా కేశవర్ధన్ ....రెస్పాండెంట్లు

To

1.రావినూతల అంజలి
భర్త ఆదాము పల్లామల్లి గ్రామం S.C.కాలనీ(మాదిగ) చీమకుర్తి మండలం
ప్రకాశం జిల్లా. ప్రస్తుతం వెలగపూడి గ్రామం టంగుటూరు మండలం ప్రకాశం జిల్లా
2.డోలా కేశవర్ధన్, తండ్రి నాట్ నౌన్
నివాసం వెలగపూడి గ్రామం,టంగుటూరు మండలం ప్రకాశం జిల్లా

పై పిటిషన్‌లో పిటిషనర్ మీలో ఒకటవ వారిపై విడాకుల కొరకు పిటిషన్ దాఖలు చేసి మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పేపర్ ప్రకటన ద్వారా నోటీసు జారీ నిమిత్తం వాయిదా తేది 14-12-2023కి వేసి ఉన్నారు ఆ రోజు ఉదయం 10 గంటల 30 నిమిషాలకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు లేనియెడల మీ పరోక్షమందు దావా తీర్మానించబడునని తెలియ పరచడమైనది

ఇట్లు
మామిడాల మనోహర్
అడ్వకేట్,ఒంగోలు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సెషన్స్ జిల్లా జడ్జి వారి కోర్టులో, ఒంగోలు.

GWOP : 26/2023

Between

పొంగూరి రామతీర్థం ..... పిటిషనర్

and

పొంగూరి శ్రీనివాసరావు .... రెస్పాండెంట్

జనరల్ నోటీసు

పై గార్డియన్ ఓపిలో పిటీషనర్, మైనర్ అయినటువంటి పొంగూరి శర్వానికి న్యాచురల్ గార్డియన్ అయినందువల్ల, మైనర్ కు షెడ్యూలు దాఖల ఆస్తిలో హక్కు కలిగిన 1/3 వంతు భాగాన్ని అమ్ముటకు, పై కోర్టు వారి ఎదుట అనుమతి కొరకు గార్డియన్ ఓపి దాఖలు చేయడమైనది. పొంగూరి శర్వాణికి గల 1/3 వంతు భాగాన్ని పొంగూరి రామతీర్థం అమ్ముటకు ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న యెడల గౌరవ కోర్టు వారి ఎదుట తేది 10-11 2023 న ఉదయం 10:30 కు స్వయంగా గాని వారి న్యాయవాది ద్వారా గాని హాజరై తమ ఆక్షేపణలను సమర్పించగలరు. లేనియెడల వారి పరోక్షములో కోర్టు వారు విచారించి తీర్మానించగలరు

షెడ్యూలు ఆస్తి హద్దులు :- ప్రకాశం జిల్లా, ఒంగోలు మండలం. త్రోవగుంట మజర, వలేటి వారి పాలెం గ్రామం త్రోవగుంట సర్వే నెంబరు 546/2
తూర్పు : పంచాయితి రోడ్డు.
దక్షిణము : మామిడి వరదరాజు ఆస్తి.
పడమర : కరవాది అంజనేయిలు, వీరాస్వామి ఇల్లు.
ఉత్తరము : మా తాలూకా ఆస్తి.

పై హద్దులలో "532" చదరపు అడుగులు లేక 7 గదుల28 చదరపు అడుగుల ఖాళీ స్థలం

// గౌరవ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

తేదీ: 03-11-2023
ప్రదేశము : ఒంగోలు

ఇట్లు
నల్లూరి అవనీష్
మిరియాల శ్రీనివాసరావు.
న్యాయవాదులు.
జిల్లా కోర్టు ఎదురు, ఒంగోలు

బస్సు యాత్రను జయప్రదం చేయండి : ఎమ్మెల్యే

- ఎన్నికల హామీలను నూరు శాతం అమలు చేసిన సిఎం 'జగన్'
- వైసిపి ప్రభుత్వంలో సామాజిక న్యాయం
- 6న బస్సు యాత్ర మార్కాపురం రాక

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

వైసిపి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం అమలు చేయడం జరిగిందని, దేశంలో ఎక్కడా ఈ విధంగా ఎన్నికల హామీలు అమలు చేసిన వారు లేరని మార్కాపురం శాసనసభ్యులు కుందురు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 6వ తేదీన సామాజిక సాధికార బస్సు యాత్ర మార్కాపురం చేరుకోనుంది. ఈ మేరకు ఆ యాత్ర జయప్రదం చేయాలని కోరుతూ శనివారం స్థానిక చెన్నకేశవనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలకు సామాజిక న్యాయం జరిగిందంటే జగనన్న ప్రభుత్వంలోనే అని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల నుంచి మొదలుకుని నామినేటెడ్ పదవుల వరకు సామాజిక న్యాయం చేశారన్నారు. ఉద్యోగాల్లోనూ, వాలంటీర్ల ఎంపికలోనూ అదే విధంగా జరిగిందన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలతో మార్కాపురం నియోజకవర్గంలోని 84 వేల గృహాలకు లబ్ధి చేకూరిందన్నారు. నాలుగున్నర సంవత్సరాల కాలంలో విద్య, వైద్య రంగంలో ఎంతో అభివృద్ధి జరిగిందని చెప్పారు. చేసిన మంచి పనులు, ప్రజలకు జరిగిన మేలు వివరించేందుకు సామాజిక సాధికార బస్సు యాత్రను వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిందన్నారు. ఈ యాత్ర మార్కాపురం పట్టణానికి ఈ నెల 6వ తేదీన సోమవారం నాడు చేరుకుంటుందన్నారు. ఈ సందర్భంగా మార్కాపురం పట్టణంలోని గడియారం స్తంభం సెంటరులో మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ యాత్రలో నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. యాత్రలో భాగంగా వైసిపి పార్లమెంటరీ నేత, వైసిపి కో ఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డి, మంత్రులు మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి కె.పార్థసారధిలతో పాటు ఇతర ప్రముఖులు పాల్గొంటారన్నారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, వైసిపి పట్టణ కన్వీనర్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, మున్సిపల్ 24వ వార్డు కౌన్సిలర్ బుశ్శెట్టి నాగేశ్వరరావు, వైసిసి రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ మీర్జా షంషీర్ అలిబేగ్, వైసిపి తర్లుపాడు మండల కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, వైసిపి నాయకులు కనిగిరి రమణారెడ్డి, కోలగట్ల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోల్తా పడిన ట్రాక్టర్

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి
ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని ఉప్పుటూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వీరన్నపాలెం నుంచి ఉప్పుటూరు వైపు వేగంగా వచ్చిన ట్రాక్టర్ తూర్పు చెరువు మలుపు వద్ద ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్ నడుపుతున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన రాహుల్ (23) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. రాహుల్ విద్యుత్ స్తంభాల లైన్లు వేసే పని నిమిత్తం ఇక్కడికి వచ్చాడు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పర్చూరుకు తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

తప్పుడు పత్రాలు సృష్టించి రూ.16కోట్లు విలువైన భూమిని విక్రయించిన ఆకుల గాలయ్య అనే వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, ఉపకలెక్టర్ సేదు మాధవన్ విచారణ చేపట్టి మార్కాపురం తహశీల్దార్‌కు లిఖిత పూర్వకంగా ఆదేశాలు జారీ చేశారు. ఆదేశాల మేరకు మార్కాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పట్టణ ఎస్ఐ పి.కోటేశ్వరరావు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు తహశీల్దారు డి.మంజునాథరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నగదు అందజేస్తున్న దృశ్యం

మట్టి ఖర్చులకు రూ.10 వేలు అందజేత

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్ద దోర్నాల మండలంలోని ఐనముక్కల గ్రామానికి చెందిన చిట్యాల నరసింహారెడ్డి (40) శుక్రవారం సాయంత్రం అకస్మాత్తుగా గుండె నొప్పి రావడంతో పెద్ద దోర్నాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మతి చెందాడు. చిట్యాల నరసింహారెడ్డి వైయస్సార్ భీమా పథకంలో పేరు నమోదు చేసి ఉండటం వలన వైయస్సార్ బీమా పథకం కింద సచివాలయం-4 వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ చిట్యాల వెంకటేశ్వర్ రెడ్డి, మతుని భార్య చిట్యాల నరసమ్మకు మట్టి ఖర్చుల కింద రూ.10వేలు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలోచిట్యాల రామకష్ణారెడ్డి, చిట్యాల సంధిరెడ్డి, తంగిరాల చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదిశేషయ్యకు నివాళి

కొండపి : మర్రిపూడి మండలం అయ్యప్పరాజుపాలెం గ్రామానికి చెందిన గుట్లపల్లి ఆదిశేషయ్య అనారోగ్యంతో మరణించాడు. ఈ సందర్భంగా కొండపి శాసన సభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి ఆదిశేషయ్య భౌతిక గాయానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంభసభ్యులను పరామర్శించారు. ఈయన వెంట మండలంలోని నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రథమ చికిత్స కేంద్రం దహనం

గోడలపై వైసిపి పేరుతో బెదిరింపు రాతలు

ప్రజాశక్తి-కనిగిరి

మండలంలోని కంచర్లవారిపల్లిలో ప్రథమ చికిత్స కేంద్రాన్ని గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి దహనం చేశారు. ఈ విషయం శనివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. కనిగిరి పట్టణానికి చెందిన ఆర్‌ఎంపి యు అజయ్‌కుమార్ కనిగిరి మండలం, కంచర్లవారిపల్లి రోడ్డులోని ఒక రూములో ప్రథమ చికిత్స కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగా తన విధులను నిర్వహించుకొని శుక్రవారం రాత్రి ఇంటికి చేరుకున్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ప్రథమ చికిత్స కేంద్రం తలుపులు పగలగొట్టి లోపల వస్తువులు, మందులు, సర్టిఫికెట్లను దహనం చేశారు. కేంద్రం గోడలపై వైసిపి పేరుతో బెదిరింపు రాతలు రాశారు. శనివారం ఉదయం అజయ్‌కుమార్ ప్రథమ చికిత్స కేంద్రం వద్దకు వెళ్లగా తలుపులు పగలగొట్టి ఉండి, లోపల వస్తువులు, మందులు దగ్ధమై ఉండటాన్ని గమనించాడు.



గోడలపై రాసిన బెదిరింపు రాతలు (ఇన్‌సెట్‌లో కాలిపోయిన వస్తువులు)

గోడలపై బెదిరింపు రాతలను చూసి భయాందోళనకు గురై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే, వైసిపి నాయకుల పేర్లు, సెల్ నెంబర్‌తో బెదిరింపు రాతలు కేంద్రం గోడలపై రాసి ఉండటం గమనార్హం.

రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత

ఏపీడీ వెంకటస్వామి

ప్రజాశక్తి-టంగుటూరు.

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత కల్పించాలని అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటస్వామి సూచించారు. శనివారం మండలంలోని తూర్పునాయుడుపాలెం గ్రామంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈజీఎస్ 2 వ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తూర్పునాయుడుపాలెం గ్రామంలో గుర్తించిన 12,016 పనులకు సంబంధించి లేబర్ బడ్జెట్ వేసి చేపట్టాల్సిన పనులను వివరించారు. జిల్లా కలెక్టర్, పథకం ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు పిఆర్‌ఏ పద్ధతిలో సీజనల్ మ్యాప్, రిసోర్స్ మ్యాప్ లు వేసి పనులను గుర్తించినట్లు తెలిపారు. గ్రామాలలో పూడికతీత పనులు కాకుండా రైతు వారీ కుంటలు, కమ్యూనిటీ సోక్ పిట్ లు, కందకాలు, పొలాల వెంట రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా తీర ప్రాంత గ్రామాలలో చేపల డ్రైయింగ్ ప్లాట్ ఫామ్‌లు, చేపల పెంపకం కోసం పాండ్స్ పనులు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ఎం సుభాషిణి, ఈసీ దివికుమార్, టిఏ లు లూథియా, శంకర్, శ్రీను లతో పాటు అన్ని గ్రామాలలోని ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాలు జయప్రదం చేయండి

ప్రజాశక్తి-చీమకుర్తి

చెకుముకి సైన్స్ సంబరాలు జయప్రదం చేయాలని జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ బి జవహర్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం సాధనిక జవహర్ నర్సింగ్‌హోంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన సైన్స్ సంబరాల వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. డాక్టర్ జవహర్ మాట్లాడుతూ చెకుముకి టాలెంట్ టెస్టు పోటీలు పాఠశాల స్థాయి ఈనెల 10న, మండల స్థాయి ఈనెల 30న, జిల్లాస్థాయి డిసెంబర్17న, రాష్ట్రస్థాయి విశాఖపట్నంలో 2024 జనవరి 27, 28 తేదీలలో జరుగుతాయని తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు ఈ టాలెంట్ టెస్టులో పాల్గొనాలని కోరారు. ఆయా పాఠశాలల ప్రదానోపాధ్యాయులను టాలెంట్ టెస్టులో పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెవివి మండల అధ్యక్ష, కార్యదర్శులు నల్లూరి వెంకటేశ్వరరావు, చలువాది రమేష్, కోశాధికారి బి ఆంజనేయులు, గౌరవాధ్యక్షులు వీరారెడ్డి, జిల్లా నాయకులు పి దేవదాసు, ఎస్‌కె శిలార్, మన్నం సుబ్బారావు, ముప్పరాజు వెంకటరావు, ఎన్ పీరుసాహెబ్, ఎన్‌పి వెంకటేశ్వర్లు, చలువాది శ్రీనివాసరావు, ముత్యాల ప్రసాదు, కోటి పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు

'నో యాక్సిడెంట్ డే'

ప్రజాశక్తి-కొండపి

జిల్లా ఎస్పీ మల్లికాగర్గ్ ఆదేశాల మేరకు కొండపి మండలంలోని పెరిదేపి-మిట్టపాలెం గ్రామాల మధ్య నోయాక్సిడెండ్ డే కార్యక్రమాన్ని శనివారం ఏఎస్ఐ జిలాని భాషా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ అధిక వేగంతో ప్రయాణించడం వలన ప్రమాదాలు జరుగుతాయని, వేగ నియంత్రణ పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చుని తెలిపారు. ఆటోలు అధికంగా ప్రయాణికులను ఎక్కించుకొని దూర ప్రాంతాలకు పోతున్నారని వెళ్లేటప్పుడు వేగంగా వెళ్లడం వలన వేగ నియంత్రణ కాకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వాహనదారులు మలుపుల వద్ద వేగ నియంత్రణ చేసుకొని వెళ్లాలని, కూలీలు కూడా ఆటోలో ఎక్కువమంది వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ నాగరాజు

కొండపి ఎస్ఐగా నాగరాజు

ప్రజాశక్తి-కొండపి

కొండపి నూతన ఎస్ఐగా వై.నాగరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. నాగరాజు వీఆర్ నుంచి జిల్లా ఎస్పీ మల్లికాగార్గ్ ఆదేశాల మేరకు వచ్చినట్లు తెలిపారు. శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కొండపిలో ప్రధానం ట్రాఫిక్ సమస్య ఉన్నట్లు గుర్తించడం జరిగిందని వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేస్తానని అన్నారు. ప్రమాదాల నియంత్రణ చర్యలు చేపడతానని శాంతి భద్రతలపై దృష్టి సారిస్తానని తెలిపారు.

ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పాలేటి

ఎమ్మెల్యేగా పోటీ చేస్తా..ఆదరించండి

మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు

ప్రజాశక్తి - చీరాల

రానున్న అసెంబ్లీ ఎన్నికలలో తాను ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, తనను అన్ని వర్గాల ప్రజలు ఆదరించాలని మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు కోరారు. పట్టణంలోని హారిస్‌పేటలో ఆయన తన కార్యకర్తలతో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో నన్ను ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ పాలేటి హయాంలో హరీష్‌పేటలో 70మందికి ఇళ్ల పట్టాలు ఇప్పించినట్లు చెప్పారు. దళితులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించారని అన్నారు. ఎఎంసి ఛైర్మన్ పదవిని దళితులకు కేటాయించే ఆనవాయితీని డాక్టర్ పాలేటి ప్రారంభించారని అన్నారు. 8వ వార్డులో అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టారని అన్నారు. పేరాల పెద్ద రథం వద్దనుండి చీరాల మసీదు సెంటర్ వరకు డివైడర్‌తో డబల్ రోడ్డు నిర్మాణం చేపట్టారని అన్నారు. అనేకమంది వృద్ధులు, వితంతువులకు పింఛన్లు మంజూరు చేయించారని అన్నారు. తాము డాక్టర్ పాలేటిని అనుసరిస్తామని అన్నారు. అనంతరం పాస్టర్ రాబర్ట్ రవి కుమార్‌చే దైవ ప్రార్థన చేశారు. దేవరపల్లి బాబురావు సభకు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎఎంసీ మాజీ ఛైర్మన్ డేటా జోసెఫ్, మాజీ కౌన్సిలర్లు బత్తుల కోటేశ్వరరావు, ఎంద్రపాటి సామేలు, దేవరపల్లి దావీదు, డేటా విజయ్, డేటా రవి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఎం నేత మజుందార్

ప్రజారక్షణభేరి కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

అసమానతలు లేని అభివృద్ధి కోసం, ప్రజాసమస్యలే అజెండాగా సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 15న విజయవాడలో జరిగే ప్రజారక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ మజుందార్ కోరారు. మార్టూరు, యద్దనపూడి మండలాల సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి బత్తుల హనుమంతరావు ఆధ్వర్యంలో ప్రజారక్షణ భేరి గోడ పత్రికను శనివారం ఆవిష్కరించారు. అధికారం కోసం వైసిపి, టిడిపి, జనసేన, బిజెపి ఈ రాష్ట్రంలో కుర్చీల యాత్ర చేపడుతుంటే, ప్రజాసమస్యలపై ప్రజారక్షణ పేరుతో సిపిఎం బస్సు యాత్ర చేపట్టిందని అన్నారు. సిపిఎం నేతృత్వంలో ప్రారంభించిన బస్సు యాత్ర ఈ నెల 8న పర్చూరుకు వస్తుందని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎనికపాటి రాంబాబు, బొడెంపూడి సూరిబాబు, గఫూర్ పాల్గొన్నారు.

అద్దంకి : ప్రజా రక్షణ సమరభేరి సిపిఎం యాత్రలను జయప్రదం చేయాలని సిపిఎం కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని సింగరకొండపాలెంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నాయని అన్నారు. కేంద్రంలో బిజెపి ధరలను అదుపు చేయడంలేదని అన్నారు. రాష్ట్రంలోని వైసిపి అడ్డూ, అదుపు లేకుండా విద్యుత్ ఛార్జీలు పెంచుతుందని అన్నారు. ప్రజల సమస్యలు వదిలేసి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నాయని ఆరోపించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 7న జరిగే బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ ఏడాది సాగర్ నీరు లేక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పంటలు ఎండిపోయే దశ ఉన్నప్పటికీ ప్రభుత్వం తాత్కాలికమైన చర్యలు కూడా తీసుకోవడం లేదని విమర్శించారు.

స్కూల్ గ్రౌండ్‌లో ఇసుక తవ్వకాలు

◆ వెంగళరావునగర్ పేదలకు ఇంటి పట్టాలివ్వాలి ◆ ప్రభుత్వ వైద్యశాలకు గేట్లు అమర్చాలి ◆ పేరాల హైస్కూల్ క్రీడా మైదానం కాపాడాలి ◆ సిపిఎం పాదయాత్రలో వెలుగు చూసిన సమస్యలు

ప్రజాశక్తి - చీరాల

సిపిఎం పాదయాత్ర బృందం రెండో రోజు పట్టణంలో పర్యటించారు. పేరాల ఎఆర్ఎం ఉన్నత పాఠశాల మైదానాన్ని పరిశీలించారు. ఇసుక అక్రమ వ్యాపారులు విద్యార్థుల క్రీడా మైదానాన్ని కూడా వదల్లేదని పేర్కొన్నారు. సమారు 300ట్రిప్పర్ల వరకు పాఠశాల మైదానాన్ని తవ్వి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. మైదానంలో ఇసుక తవ్విన గుంటలకు పట్టణంలోని చెత్త, వ్యర్థాలతో నింపి దానిపైన ఎర్రమట్టి పోసి చదును చేశారని ఆరోపించారు. పాఠశాల మైదానంలో ఇసుక తవ్వకాలపై విచారణ జరిపి అక్రమాలకు పాల్పడ్డవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో విద్యార్థులు, సమీప ప్రాంత యువకులు ఆడుకునేందుకు అనువుగా ఉన్న క్రీడా మైదానంలో అక్రమంగా ఇసుక తవ్వి ఆ గుంటలకు ఎర్రమట్టి పోసి చదును చేసి ఆడుకునేందుకు వీలులేకుండా మైదానం మద్యలో పార్కు నిర్మాణం చేశారని ఆ ప్రాంత యువకులు సిపిఎం బృంధం దృష్టికి తెచ్చారు. తక్షణం పాఠశాల

పాదయాత్రలో మాట్లాడుతున్న సిపిఎం కార్యదర్శి బాబురావు

మైదానాన్ని ఆడుకునేందుకు అనువుగా మార్చాలని కోరారు. వెంగళరావునగర్‌లో నివాసం ఉంటున్న పేదల ఇళ్లకు పట్టాలు ఇచ్చి వారి నివాస ప్రాంతంలో డ్రైన్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. శిధిలావస్థకు చేరిన సంక్షేమ వసతి గృహ సముదాయ భవనాలను తొలగించి నూతన భవనాలు నిర్మించాలని కోరారు. శిధిలావస్థకు చేరిన భవనాల్లో అసాంగిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు ఆ భవనాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లే అన్నివైపుల గేట్లను అమర్చాలని కోరారు. పాదయాత్రలో సిపిఎం కార్యదర్శి ఎన్ బాబురావు, నాయకులు ఎం వసంతరావు, పి కొండయ్య, జి ప్రతాప్ కుమార్, ఎల్ జయరాజు, ఎన్ వెంకట్రావు, కె రాజాలు, పి ఆదిశంకర్, ఎం సత్యమూర్తి, వై కిషోర్, ఐవి ప్రసాద్, వి భగవాన్ దాస్, ఎం అయ్యపరెడ్డి, ఎన్ లక్ష్మీ, జి శ్రీను, సత్యవేలు, శివనాడియన్ పాల్గొన్నారు.

పాదయాత్రను ఆదరిస్తున్న ప్రజలు

పట్టణ సమస్యల పరిష్కరించాలని సిపిఎం నాయకులు చేపట్టిన పాదయాత్రను పట్టణ ప్రజలు స్వాగతించారు. పలుచోట్ల సిపిఎం నాయకులకు పూలతో స్వాగతం పలికారు. మండే ఎండలను సైతం లెక్కచేయకుండా ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా సిపిఎం పాదయాత్ర చేయడం తమకు ఎంతో ఆనందంగా ఉంది అంటూ ఓ బాటసారి తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ పాదయాత్ర చేస్తున్నా వారి దాహన్ని తీర్చేందుకు తన సొంత డబ్బులతో మంచినీళ్ల బాటిల్లను కొనుగోలు చేసి పంపిణీ చేశారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి

● విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు ● విశాఖ ఉక్కును అమ్మితే చూస్తూ ఊరుకోం ● ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య

బంద్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో పట్టణ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 8న బందుకు పిలుపు ఇచ్చినట్లు తెలిపారు. ఈ బందుకు విద్యాసంస్థలు, విద్యార్థులు, ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తున్న పెద్ద పరిశ్రమ విశాఖ ఉక్కు పరిశ్రమని అన్నారు. అటువంటి పరిశ్రమను అప్పనంగా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడాన్ని రాష్ట్ర ప్రజలు చూస్తూ ఊరుకోరని అన్నారు. 332మంది విద్యార్థుల ప్రాణ త్యాగం, విశాఖ ప్రజల పోరాటాలను గుర్తు చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమ స్థాపనకై ఆనాడు 66మంది శాసనసభ్యులు రాజీనామా చేస్తే, నేడు బిజెపి ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్ముతా ఉంటే రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు నోరు మెదపడం లేదని అన్నారు. ఇప్పటికైనా మొద్దు నిద్ర లేచి రాష్ట్ర హక్కుల కోసం పోరాడాలని కోరారు. విభజన హామీల్లో భాగంగా కడప ఉక్కు పరిశ్రమను నిర్మిస్తామన్న హామీని విస్మరించారని అన్నారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధి కోసం కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, గణేష్, గోపి, శరత్, సురేష్ పాల్గొన్నారు.

రేపల్లె : విశాఖ ఉక్కు పరిశ్రమ కార్మికుల ఆందోళన 1000 రోజులు పూర్తి అవుతున్న సందర్భంగా కార్మికులకు మద్దతుగా విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 8న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు కెవి లక్ష్మణరావు తెలిపారు. వివిధ విద్యా సంస్థల యాజమాన్యాలు సహకరించాలని కోరారు. స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో బంద్ పోస్టర్‌ను ఆయన శనివారం ఆవిష్కరించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టిన దగ్గర నుండి దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టడమే పరిపాలనగా సాగుతుందని ఆరోపించారు. పరిశ్రమలను స్థాపించి ఉద్యోగాలు ఇవ్వలేని కేంద్ర ప్రభుత్వం వైజాగ్ స్టీల్ ప్లాంట్ ను అమ్మడానికి ప్రయత్నం చేస్తే విద్యార్థులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఎంతో మంది ప్రాణాలను త్యాగం చేసి స్టీల్ ప్లాంట్ స్థాపనకు కృషి చేశారని గుర్తు చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కేంద్రానికి సహకరిస్తుందని ఆరోపించారు. స్టీల్‌ప్లాంటును కాపాడుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు వై నవీన్, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి ఎం సూర్య, నాయకులు ప్రవీణ్, వంశీ, సాయి, గర్ల్స్ కన్వీనర్ కె హైమశ్రీ, మహాలక్ష్మి, భవాని, మంజీర, నికిత పాల్గొన్నారు.

రేపల్లెలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థులు

ప్రజాసమస్యలే అజెండాగా సిపిఎం ప్రజారక్షణభేరి

కరపత్రాల పంపిణీలో మాట్లాడుతున్న సిపిఎం మణిలాల్

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలో స్థానిక సమస్యలు పరిష్కారం చేయకుండా ప్రజలని మోసం చేస్తున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ అన్నారు. పట్టణంలో పలు ప్రాంతాలో సిపిఎం ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజ సమస్యలు పరిష్కారం లక్ష్యంగా విజయవాడలో ఈనెల 15న బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిపిఎం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజా రక్షణభేరి ప్రచార జాతా ఈనెల 8న పట్టణానికి వస్తుందని తెలిపారు. పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నామని అధికార పార్టీ నేతలు, అధికారులు రోజూ గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. దోమలు దగ్గర నుండి త్రాగునీరు, డ్రైనేజిల నిర్వహణ, ప్రజల ఆరోగ్యాలు కాపాడటంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. అభివృద్ధి పేరుతో ప్రజలపై ఇంటి పన్నులు పెంచి ప్రజలను దోచుకుంటున్నారని అన్నారు. డ్వాక్రాలో పేద మహిళలను మోసం చేసి దొంగలోన్లు పొందిన మున్సిపల్ మెప్మా సిబ్బందిపై చర్యలు తీసుకోలేదని అన్నారు. దొంగ లోన్లను రద్దుచేసి, 21వ వార్డు డ్వాక్రా మహిళలకు న్యాయం చేయాలని కోరారు. అప్పులు చేసి జగనన్న కాలనీల్లో ఇళ్ళు నిర్మించుకున్న లబ్ధిదారులకు నివాసానికి అనుకూలంగా రోడ్లు, డ్రైనేజి, మంచినీరు, విద్యుత్ తక్షణం ఏర్పాటు చేయాలని కోరారు. 1350 మంది లబ్ధిదారులు అద్దెలు కట్టలేక, అప్పులు పాలవుతున్నారని అన్నారు. 75శాతం గత ప్రభుత్వంలో టిట్కో ఇళ్ళను పూర్తి చేశారని, మిగిలిన పనులు వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని కోరారు. 28-27, 10-13 వార్డుల పరిధిలో క్రొత్తగా ఏర్పడిన జగనన్న కాలనీలో అదనపు వాటర్ ట్యాంకులు నిర్మించాలని కోరారు. చిన్న వైద్య అవసరాల కోసం కూడా తెనాలి, గుంటూరు రిఫర్ చేయకుండా స్థానిక ప్రభుత్వం హాస్పటల్‌నే 100పడకల హాస్పటల్‌గా అభివృద్ధి చేసి, అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు కె రమేష్, కె ఆశీర్వాదం, వి మావో, వై కిషోర్, సూర్య ప్రకాశరావు, కె మరియదాసు పాల్గొన్నారు.

కొల్లూరు : మండలంలోని తోకలవానిపాలెం గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా రక్షణ బేరి యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి కృష్ణమోహన్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం విద్యా విధానం వలన ప్రభుత్వ పాఠశాలలు మూత పడుతున్నాయని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు నామ మాత్రంగా తయారవడంతో కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడీకి సామాన్యులు బలైపోతున్నారని అన్నారు. సిపిఎం ప్రజా రక్షణ బేరి బస్సు యాత్ర ఈ నెల 8న సాయంత్రం బట్టిప్రోలు చేరుకుంటుందని అన్నారు. స్థానిక రథం సెంటర్లో జరిగే బహిరంగ సభకు ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ప్రజారక్షణ భేరి కరపత్రాలు పంపిణీ చేస్తున్న కృష్ణమోహన్

ప్రణాళికాబద్ధ ప్రయత్నంతో విజయం

కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రణాళికాబద్ధ ప్రయత్నంతో విజయాన్ని సొంతం చేసుకోవచ్చని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. ఇందు కోసం లోపాలను గుర్తించి వాటిని అధిగమించేలా సాధన చేయడం ఎంతో ముఖ్యమన్నారు. ఒంగోలులోని దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని మూడవ సంవత్సరం చదువుతున్న 20 మంది విద్యార్థినులతో శనివారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో ఆయన "కాఫీ విత్ కలెక్టర్" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభిరుచులు, ఆకాంక్షలు, కుటుంబ నేపథ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లక్ష్య సాధనలో పేదరికాన్ని అడ్డుగా భావించవద్దని తెలిపారు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవడంపై దృష్టి పెట్టాలని, అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. సమాజంలో వస్తున్న మార్పులను గమనిస్తూ నిరంతరం కొత్త విషయాలు నేర్చుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వినూత్నంగా ఆలోచిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే లక్ష్యాన్ని సాధించవచ్చని విద్యార్థినులలో ఆయన స్ఫూర్తిని నింపారు. తన విద్యాభ్యాసం, ఐ.ఏ.ఎస్. అధికారి కావాలనే లక్ష్యం, ఈ దిశగా చేసిన ప్రయత్నాలను విద్యార్థులతో కలెక్టర్ పంచుకున్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ బి.కళ్యాణి, జెకెసి కో-ఆర్డినేటర్ ఎ.వి.రాజ్యలక్ష్మి, లైబ్రరీ సైన్స్ లెక్చరర్ ఎం.శ్రీనివాసులు, ఎన్.ఎస్.ఎస్. ఆఫీసర్ శ్రీలక్ష్మి, స్టూడెంట్ కో-ఆర్డినేటర్ బి.శ్రావణి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ మహిళలకు మెరుగైన జీవనోపాధి

- జీవన ప్రమాణాలు మెరుగులో మహిళా సమాఖ్యలే కీలకం
- జిల్లా సమాఖ్య జనరల్ బాడీలో కలెక్టర్ దినేష్‌కుమార్ వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

గ్రామీణ మహిళలకు మెరుగైన జీవనోపాధి కల్పించి వారి కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగుపరచడంలో మహిళా సమాఖ్యలు కీలకపాత్ర పోషించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. గత నెలలో కొత్తగా ఎన్నికైన జిల్లా సమాఖ్య జనరల్ బాడీ సమావేశం శనివారం స్థానిక టిటిడిసి సమావేశ మందిరంలో శనివారం జరిగింది. కొత్తగా ఎన్నికైన సభ్యులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపి వారిని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 85 శాతం మహిళలు స్వయం సహాయక సంఘా(ఎస్‌హెచ్.జి) లలో సభ్యులుగా ఉన్నారన్నారు. మిగతా 15 శాతం మందిని కూడా ఎస్.హెచ్.జి. లలో సభ్యులుగా చేర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎస్.సి., ఎస్.టి., ఇతర బలహీన వర్గాల మహిళలందరూ కచ్చితంగా ఎస్. హెచ్. జి.లలో ఉండేలా పర్యవేక్షించాలని దిశానిర్దేశం చేశారు. దేశంలో ఏ వ్యవస్థకూ లేని విధంగా 99.5 శాతం రుణాల రీపేమెంట్ ఘనత ఎస్. హెచ్.జి.లకే దక్కుతుందన్నారు. సంఘాలుగా బలపడటంతోపాటు వ్యక్తిగతంగానూ ఆర్థికంగా ఎస్.హెచ్.జి. మహిళలు

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

విలదొక్కుకునేలా ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రకాశం జిల్లా ప్రధానంగా వ్యవసాయ ఆధారితమైన ప్రాంతం కావటంతో మహిళలకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించడంపై ఈ సమాఖ్యలు మరింతగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. జగనన్న పాలవెల్లువ పథకంతోపాటు ఇతర పథకాలను ఉపయోగించుకుని స్వయం ఉపాధి పొందేలా గ్రామీణ మహిళలకు చేదోడువాదోడుగా ఉండాలని స్పష్టం చేశారు. మానవ అభివృద్ధి సూచికలో గ్రామీణ ప్రాంత కుటుంబాల స్థాయి మెరుగు పడేలా చూడాలన్నారు. బాల్య వివాహాల నివారణలోనూ వి.ఒ.ఏలు చురుకైన పాత్ర పోషించేలా చూడాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఎస్.హెచ్.జి. లను ఆదర్శంగా తీసుకుని రైతులను సంఘటితం చేసేలా ఎస్.పి.జి.లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామీణ మహిళల జీవన ప్రమాణాలు పెంచేలా.. ఏర్పాటు చేసిన ఎస్. హెచ్.జి.లు అదే స్ఫూర్తితో ముందుకు వెళ్లేలా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని జిల్లా సమాఖ్యను ఆదేశించారు. డి.ఆర్.డి.ఏ. పి.డి. రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలో 1,534 వి.ఒ.ఏలు ఉన్నాయని, వీటి పరిధిలో 44,320 ఎస్. హెచ్.జి.లు పని చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 4,46,776 మంది మహిళలు ఈ గ్రూపులలో సభ్యులుగా ఉన్నట్లు తెలిపారు. ఏ గ్రేడ్లో 66.65 శాతం, బి గ్రేడ్లో 24.08 శాతం ఎస్. హెచ్.జి.లు ఉన్నట్లు ఆయన తెలుపగా, అన్ని ఎస్. హెచ్.జి.ల గ్రేడ్ మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌డిఏ సిబ్బంది, విఒఏలు పాల్గొన్నారు.

ప్రజారక్షణభేరిని జయప్రదం చేయాలి

సిపిఎం జిల్లా నాయకులు గంటెనపల్లి శ్రీనివాసులు

ప్రజాశక్తి-టంగుటూరు

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న ప్రజారక్షణ భేరిని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గంటెనపల్లి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శనివారం టంగుటూరులో ప్రజారక్షణ భేరి ప్రచార యాత్ర వాల్ పోస్టర్‌ను సిపిఎం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో కరువు విలయతాండవం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వేల ఎకరాలలో పెట్టిన పొగనారు తీవ్ర వర్షాభావంతో ఇప్పటికీ పీకలేని దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రధాన పంటలకు కూడా కరువు పరిస్థితులు చుట్టుముట్టాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ బహిరంగ సభకు అఖిలభారత సిపిఎం కార్యదర్శి సీతారాం ఏచూరి, సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, సిపిఎం అగ్ర నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు, బలహీన వర్గాల ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిర్వహిస్తున్న ఈ బహిరంగ సభకు కొండపి నియోజకవర్గ ప్రజలు భారీగా హాజరై జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం టంగుటూరు మండల కార్యదర్శి వేశపోగు మోజెస్, సిపిఎం జిల్లా నాయకులు టంగుటూరి రాము, సిపిఎం నాయకులు కొల్లాబత్తిన శ్రీను, ముక్కు శ్రీను, మాధవ, సురేష్ తదితరులు ఉన్నారు

దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడాలి

టిడిపి కనిగిరి ఇన్‌ఛార్జి డాక్టర్ ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు, వైసిపి దుర్మార్గపు పాలనపై ప్రజా చైతన్యం కలిగించేందుకు మన ఊరు మన ఉగ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కనిగిరి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలియజేశారు. శనివారం ఉదయం కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని పాత కూచిపూడిపల్లి ,సాయంత్రం కొత్తూరు లో మన ఊరు మన ఉగ్ర కార్యక్రమం కొనసాగగా ఆయన పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకుంటూ చైతన్య పరుస్తూ

కూరగాయల వ్యాపారితో మాట్లాడుతున్న ఉగ్ర నరసింహారెడ్డి

ముందుకు సాగారు. బాబుతో నేను కరపత్రాలు పంపిణీ చేస్తూ చంద్రబాబు అక్రమ అరెస్టు గురించి ప్రజలకు వివరించారు. ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కనిగిరి మండల పార్టీ అధ్యక్షులు నంబుల వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు రాచమల్ల శ్రీనివాస్ రెడ్డి, ముచ్చుమారి చెంచిరెడ్డి, షేక్ ఫిరోజ్, షేక్ అహ్మద్, నుదురుపాటి సుబ్బయ్య, తమ్మినేని వెంకటరెడ్డి, చింతలపూడి తిరుపాలు, నంబుల కొండయ్య, కడప సుధాకర్, బాలు ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కొత్తపట్నంలో ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం శ్రీవాణి విద్యానికేతన్ ఆధ్వర్యంలో ఒంగోలు శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో ఆదివారం ఉదయం 9 గంటలకు కొత్తపట్నంలోని శ్రీవాణి విద్యానికేతన్ స్కూల్ ఆవరణలో ఉచిత మెగా మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రముఖ వైద్యులు డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో చిన్న పిల్లల్లో వచ్చే అన్ని రకాల జబ్బులు, ఎముకలు, కీళ్లు, నరములు, స్త్రీల సమస్యలు, గర్భిణీ స్త్రీల సమస్యలు, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ సమస్యలు, ఊపిరితిత్తులు, ఇ.యన్.టి. సమస్యలు, దంత సమస్యలు, ఫిజియోథెరపీ సమస్యలు , జ్వరాలు, నెమ్ము, దగ్గు, ఆయాసం, బి.పి, షుగరు, థైరాయిడ్, కొలెస్ట్రాల్, గుండె, కిడ్నీ, లివర్ సమస్యలు, పక్షవాతం, మొదలగు అన్ని వయసులలో వచ్చు అన్ని రకాల వ్యాధులకు నిపుణులైన స్పెషలిస్ట్ వైద్యులచే ఉచితంగా పరీక్షించబడునని తెలిపారు. బిపి, ఇసిజి గుండె పరీక్ష, షుగరు, యూరిక్ యాసిడ్, పాదాల నరాల స్పర్శ పరీక్ష, పల్స్ ఆక్సీ మీటర్ పరీక్షలు ఉచితంగా చేసి అందరికీ మందులు ఉచితంగా ఇవ్వబడునని, మరిన్ని వివరాలకు హెల్ప్ లైన్ నంబర్ 8184 82 82 82 నందు సంప్రదించగలరని తెలిపారు. ఈ సదవకాశాన్ని కొత్తపట్నం మండల ప్రజలందరూ వినియోగించుకోవాలసినదిగా తెలియజేశారు.

వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

క్రీడలలో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని, వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు దోహదపడతాయని కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ తెలిపారు. స్థానిక పి.వి.ఆర్.బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న 67వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లాల సాఫ్ట్ బాల్ ఛాంపియన్ షిప్ 2023-24 పోటీలను శనివారం ఆయన క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల క్రీడలకు అవసరమైన సౌకర్యాలు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా లభించేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో సుబ్బారావు, డిప్యూటీ ఈవో అనిత రోజు రాణి, జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ వనజ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ రాజేశ్వరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివశంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణాలు ఇచ్చేందుకు సిద్ధం

వైసిపి కొండపి ఇన్‌ఛార్జి వరికూటి

ప్రజాశక్తి-శింగరాయకొండ

డ్వాక్రా సంఘాల్లో అడిగిన ప్రతి మహిళకు సబ్సిడీ రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని కొండెపి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు అన్నారు. శనివారం శింగరాయకొండ బాలాజీ నగర్‌లోని పాఠశాలలో డిఆర్డిఏ వైఎస్ఆర్ కేపీ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు సుస్థిర జీవనోపాధి కల్పన ఆసక్తి కలిగిన లబ్దిదారులకు రుణాలు ఇచ్చేందుకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన వరికూటి అశోక్ బాబు మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు అడిగిన వెంటనే రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు సిద్ధంగా ఉన్నారన్నారు. విఓ ఏ లు ద్వారా ఏమి కావాలో ఏమి ఉన్నాయో తెలుసుకుంటే రుణాలు అందించడం జరుగుతుందన్నారు. గేదెలు గొర్రెలు కార్డు పిండి మిల్లులు చపాతి మిషన్లు బఫే ప్లేట్ల మిషన్లు టెంట్ హౌస్ కోళ్ల ఫారాలు తోపాటు ఏమి కావాలో అడిగిన వెంటనే రుణాలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ప్రతి

మాట్లాడుతున్న వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి

ఒక్కరూ దీనిని వినియోగించుకోవాలని సూచించారు. అధికారులు బ్యాంకు సిబ్బంది కూడా డ్వాక్రా మహిళలకు రుణాలు ఇచ్చేందుకు సీరియస్ గా తీసుకొని పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం జయరాజ్ కెనరా బ్యాంక్ మేనేజర్ కంచర్ల సౌమ్య జెసిఎస్ కన్వీనర్ తన్నీరు సుబ్బారావు యనమల మాధవి యన్నాబత్తిన వెంకటేశ్వర్లరావు ఎస్ కే సలీం భాష ఎస్ కే పటేల్ ఎస్కే కరీం ఇండ్ల సుజాత ముల్లపూడి సత్యనారాయణ పాల్గొన్నారు.

బైటకి పోకుండా.. గేటు వేసి మరీ..

శింగరాయకొండ గ్రామ పంచాయతీలోని బాలాజీ నగర్ పాఠశాల వద్ద పెట్టిన డ్వాక్రా మహిళల అవగాహన సదస్సుకు డ్వాక్రా అధికారులు సాయంత్రం సమయంలో మహిళలను సమావేశంలో బయటకు పోకుండా గేట్లు వేసి మరి సమావేశం జరిగేలా చేశారు. మూడు ప్రాంతాల నుంచి డ్వాక్రాధికారులు మహిళలను అక్కడికి రమ్మని చెప్పగా పూర్తిస్థాయిలో మహిళలు రాకపోవడంతో ఉన్నవాళ్లు ఎక్కడ కొండెపి వైసిపి ఇన్చార్జ్ వరికూటి అశోక్ బాబు మాట్లాడే సమయంలో బయటకు పోతారేమోనని డ్వాక్రా లో ఉన్న కొంతమంది అధికారులు గేటు వేసి గేటు వద్ద నిలబడి అత్యవసరమైనప్పటికీ మహిళలను బయటకు పోనివ్వకుండా అడ్డుకున్నారు. సమయానికి సమావేశం నిర్వహించకుండా ఆలస్యంగా సమావేశం పెట్టి బయటికి పోకుండా ఇబ్బంది పెట్టడంపై మహిళలు కొంత ఇబ్బంది పడాల్సిన పరిస్థితి అక్కడ కనిపించింది.

తహశీల్దారు కార్యాలయంలో వినతి పత్రం ఇస్తున్న బాధితులు

శవపంచనామా చేయాలని వినతి

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు కోసం చేరగా అక్కడి వైద్యురాలు డాక్టర్ వాహిలా చౌదరి నిర్లక్ష్యం వల్ల చనిపోయిన గర్భిణీ స్త్రీ శీలం మెర్సీరాణి మృతదేహానికి పోస్ట్ మార్టం చేస్తేనే వస్తవ కారణాలు బయటకు వస్తాయని ఆమె తండ్రి శీలం చంద్రశేఖర్, పెద్దనాన్న శీలం రవికుమార్, బంధువులు, ప్రజాసంఘాల నేతలు తహశీల్దారు జివి సుబ్బారెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యాలయంలోని ఎఎస్ఓ అమర్నాథ్ కు వినతి పత్రం ఇచ్చారు. అలాగే డాక్టర్ వాహిలా చౌదరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయించి సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నక్కా కాంతారావు, ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ అండ్ మైనారిటీస్ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు జ్యోతి రమేష్ బాబు, ఎఐటియుసి కన్వీనర్ కెఎల్డి ప్రసాద్, బిఎస్పి నియోజకవర్గం అధ్యక్షులు మందా జోసెఫ్, మృతురాలి బంధువులు పాల్గొన్నారు.



సెయింట్ ఆన్స్‌లో ముగిసిన చిప్‌డిజైనింగ్ వర్క్‌షాపు

ముగిసిన చిప్ డిజైనింగ్ వర్క్ షాప్

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన చిప్ డిజైనింగ్పై వర్క్ షాప్ ముగిసినట్లు కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్వి రమణ మూర్తి శనివారం తెలిపారు. అక్టోబర్ 30నుండి నవంబర్ 04వరకు బిటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఎపి స్కిల్ డెవలప్మెంట్ కార్పోరేషన్ సహ కారంతో చిప్ డిజైనింగ్ పై వర్క్ షాపును నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఎం వేణుగోపాలరావు తెలిపారు. ఆధునిక ఎలక్ట్రానిక్స్‌లో చిప్ డిజైనింగ్ ఎంతో ప్రాముఖ్యత వహిస్తుం దని అన్నారు. వివిధ పనులను వేగతంగాను, ఖచ్చితంగాను నిర్వహిం చటానికి, ఎలక్ట్రానిక్స్ పరికరాలను పనిచేయిం చటానికి చిప్ డిజైనింగ్ ఎంతో ప్రాముఖ్యత వహిస్తుందని తెలిపారు. చిప్ డిజైనింగ్‌లోని ప్రాథమింక అంశాలు, చిప్ తయారిలోని వివిధ దశలు, చిప్ తయారు చేసేటపుడు ఏయే అంశాలను దృష్టిలో ఉంచుకోవాలనే అంశాలను అవగాహన కల్పించి నట్లు ఐటి హెచ్ఓడి ఎస్ ఇంద్రనీల్ తెలిపారు. వర్క షాపులో ఎపిఎస్ఎస్‌డిసి నుండి ఎం ఉమామహేశ్వరరావు, వివిధ విభాగాల హెచ్ఒడిలు పాల్గొన్నారు.

మిర్చి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

మిరప తోటల్లో ప్రొఫెసర్ల పరిశీలన

ప్రజాశక్తి - చీరాల

బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు మండలంలోని కావూరివారిపాలెం పంచాయితీలో సాగుచేసిన మిరప తోటలను శనివారం పరిశీలించారు. రైతులకు కొన్ని సూచనలు చేశారు. తెల్ల దోమ నివారణకు పసుపు పచ్చ జిగురు అట్టలను పెట్టవలెనని సూచించారు. వాటి వలన దోమ నివారణే కాకుండా పురుగు గుడ్లు పెట్టకుండా అట్ట మీద వాలి చనిపోతాయిని తెలిపారు. తామర పురుగు నివారణ కూడా చేయవచ్చని అన్నారు. కార్యక్రమంలో బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ మండవ శ్రీనివాసరావు, కీటకాల శాస్త్రవేత్త రత్న కుమారి, ప్రకృతి వ్యవసాయ ఎంఐ భారతి, ఆర్బికె చైర్మన్ కావూరి రమణారెడ్డి, ఐసిఆర్ఐ కవిత, శిరీష, నిర్మల పాల్గొన్నారు.

రిసార్ట్స్ కోసం కాల్వ పూడ్చారు

- 12వేల ఎకరాలకు ఉప్పునీటి తిప్పలు
- సముద్రంలో కలిసే కాలువ వంపును పూడ్చారు
- ఉప్పునీటిని అడ్డుకునేందుకు రైతులకు అవస్థలు

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న గవిని శ్రీనివాసరావు

ప్రజాశక్తి - చీరాల

రిసార్ట్స్, రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ఏకంగా సముద్రంలో కలిసే కాల్వను పూడ్చేశారు. చీరాల పరిసర ప్రాంతాల్లో వరద నీళ్ల సముద్రంలో కలిసేందుకు 1972లో ఈపూరుపాలెం స్ట్రెట్ కట్ తవ్వారు. కాల్వ తవ్విన అధికారులు సాంకేతిక నిబంధనలు పాటించారు. కాల్వ సముద్రంలో కలిసే చోట 90డిగ్రీలలో మలుపు తిప్పారు. దీనివల్ల సముద్రపు ఆటు పోటు సమయంలో ఉప్పునీళ్ల కాల్వలోకి రాకుండా నియంత్రించేందుకు తీసుకున్న సాంకేతిక నిర్ణయం. ఆ ప్రకారం కాల్వ నిర్మించారు. అయితే ఇటీవల సముద్ర తీరంలో పర్యాటక రంగం అభివృద్ధి అవుతుంది. ఈ నేపథ్యంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, ప్రవేటు రిసార్ట్స్ యజమానులు వాళ్ల సౌకర్యం కోసం వంపు తిప్పిన కాలువను నేరుగా సముద్రంలో కలిసేలా తవ్వేశారు. వంపు తిప్పిన కాల్వను పూడ్చేశారు. పెద్ద బండరాళ్లను భారీ క్రేన్ల సహాయంతో సముద్ర ముఖం వద్ద పూడ్చారు. ఫలితంగా ఆటు పోటు సమయంలో ఉప్పునీళ్ల సుమారు ఐదుకిలోమీటర్ల వరకు కల్వలోకి వస్తున్నాయి. పంట భూములు ఉప్పునీటితో నిండిపోతున్నాయి. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉప్పునీటిని అడ్డుకునేందుకు లక్షలు ఖర్చుపెట్టి కట్టలు వేసుకున్నప్పటికీ సముద్రపు నీటి తాకిడికి కట్టలు కరిగిపోతున్నాయి. భూగర్భ నీళ్ల ఉప్పతేలిపోతున్నాయి. గవినివారిపాలెం, విజయలక్ష్మీపురం, పచ్చమొగిలి గ్రామాల్లో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాల్వ పూడ్చిన వారిపై చర్యలు తీసుకుని 12వేల ఎకరాల భూములు కాపాడాలని ఆయా గ్రామాల రైతులు కలెక్టర్‌కు పిర్యాదు చేశారు. కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సుమారు 700మీటర్ల కాల్వను పూడ్చి ఐదు ఎకరాలకుపైగా భూమిని ఆక్రమించారు. తమ కష్టాలు గమనించి కాల్వ వంపును యధావిధిగా ఉంచి ఉప్పునీళ్ల పంట పొలాలపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్, మాజీ ఎంపీపీ గవిని శ్రీనివాసరావు, ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడి యేసురత్నం కోరారు. స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో సమస్యను వివరించారు. సమావేశంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పేదల బాధలు తెలుసుకునేందుకే పాదయాత్ర

ప్రజాశక్తి - భట్టిప్రోలు

రాష్ట్రంలో అన్ని వర్గాల పేదల బాధలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకుకే తాను జూలై 3నుండి పాదయాత్ర చేపట్టినట్లు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయ్ కుమార్ తెలిపారు. తడ నుండి తుని వరకు చేపట్టిన పాదయాత్ర 75వ రోజు భట్టిప్రోలు మండలానికి చేరుకున్నారు. అద్దేపల్లి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. పేదరికం అనేది అన్ని సామాజిక వర్గాల్లో ఉందని అన్నారు. పేదల సమస్యలు గుర్తించి పరిష్కారానికి అవసరమైన మార్గాలు తెలుసుకొనేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మౌలిక వసతులైన రహదారులు లేకపోవడం, అనేక మంది పేదలు తమ కనీస జీవనానికి ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించానని అన్నారు. దళితవాడలకు స్మశాన స్థలాలు లేకపోవడం, ఉన్న వాటికి సరైన రహదారి లేకపోవడం, మురుగు నీటి పారుదల వ్యవస్థ వంటి సమస్యలు ఉన్నాయని అన్నారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. తాను గతంలో కలెక్టర్‌గా పని చేసిన కాలంలో పేదల అభ్యున్నతికి కృషి చేశానని అన్నారు. ప్రతి కుటుంబం రోజువారీ కాకుండా నెలవారి వేతనాన్ని సాధించుకునే విధంగా తాను భూ పంపిణీ, ఇన్నోవా కార్లు వంటివి కూడా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయన సతీమణి విజయశ్రీ, జడ రవీంద్రబాబు ఉన్నారు.

మాట్లాడుతున్న రిటైర్డు ఐఎఎస్ విజయకుమార్

డెయిరీ ఎన్నికల్లో వైసిపి ఘన విజయం

ప్రజాశక్తి - భట్టిప్రోలు (చుండూరు)

చుండూరు మండలం వలివేరు పాల ఉత్పత్తి దారుల సహకార సంఘానికి శనివారం జరిగిన ఎన్నికలలో వైసిపి అభ్యర్థులు మన విజయం సాధించారు. సొసైటీలో 9మంది డైరెక్టర్లు ఉండగా సంఘ పరిధిలో 82ఓట్లు ఉన్నాయి. వీటిలో 80ఓట్లు పోలయ్యాయి. వైసిపికి చెందిన మహిళా అభ్యర్థులు కారుమూరి అన్నపూర్ణమ్మ, చీడేపూడి నళిని కుమారు ఏకగ్రీవ ఎన్నికయ్యారు. అలాగే ఓటింగ్ జరిగిన డైరెక్టర్లు వైసిపికి చెందిన ఈమని శ్రీనివాసరెడ్డికి 71 ఓట్లు, అమృతలూరి ఆదియకు 66ఓట్లు, ఉయ్యూరు ఉదయ శ్రీధర్ రెడ్డికి 67 ఓట్లు, చీడేపూడి దామోదర్ రెడ్డికి 66ఓట్లు, చీడేపూడి నాగిరెడ్డికి 68 ఓట్లు, తమ్మ సందీప్ రెడ్డికి 67 ఓట్లు, బొంపల్లి వెంకట నరసింహారెడ్డికి 66 ఓట్లతో ఏడుగురు డైరెక్టర్లు వైసీపీకి చెందిన వారే గెలుపొందారు. కాగా టిడిపి బలపరిచిన అభ్యర్థులు తమ్మ రాఘవరెడ్డికి 11ఓట్లు, గన్నేపల్లి ఏసోబుకు 14ఓట్లు పోలయ్యాయి. దీంతో సంఘం మొత్తం వైసీపీ అభ్యర్థులే కైవసం చేసుకున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. గెలుపొందిన డైరెక్టర్లకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

పాల ఉత్పతిదారుల సంఘానికి ఎన్నికైన డైరెక్టర్లు

పేదలకు అందుబాటులో ఆధునిక వైద్యం

ప్రజాశక్తి - పంగులూరు

గ్రామీణ ప్రాంతంలోని పేదలకు అందుబాటులో వైద్యం చేసి, పేదలకు సహాయపడతానని ఫిజియోథెరపీ డాక్టర్ ఎల్ అచ్యుత అన్నారు. స్థానిక ప్రార్థ నారాయణ ఫిజియోథెరపీ ఆసుపత్రిని స్థానిక ప్రభుత్వ వైద్యశాల వైద్యులు డాక్టర్ శివ చెన్నయ్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ అచ్యుత మాట్లాడుతూ ప్రస్తుత సామాజిక పరిస్థితుల నేపథ్యంలో గ్రామాలలో కూడా పక్షవాతం, అంగవైకల్యం, వంటివి ఎక్కువగా ఉన్నాయని అన్నారు. వీటికి ఫిజియోథెరపీ ఎంతో అవసరం అన్నారు. పట్టణాల్లోనే పెద్ద పెద్ద ఆసుపత్రులకు వెళ్ళలేక గ్రామీణ ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నారని, వారందరికీ అందుబాటులో ఉండి విలువైన సేవలను అందించటమే తమ ప్రధాన ధ్యేయమని అన్నారు. మెడ నొప్పి భుజం నొప్పి, మోచేయి, నడుము నొప్పి, నడుము నొప్పి, మోకాలు నొప్పి, మడమ నొప్పి, కీళ్లవాతం ,కీళ్లనొప్పి, సయాటికా నొప్పి, పక్షవాతం, నరాల బలహీనత, తల తిరగటం, నాడీ వ్యవస్థ సమస్యలు, ఫుడ్ డ్రాప్, ముఖ పక్షవాతం మొదలైన వాటికి వైద్యం చేయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేషన్ అనురాధ, వలి, నాగేశ్వరరావు, సుబ్బారావు, మోహన్ కృష్ణ, ఏలియా, సుధాకర్, హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ అచ్యుత

ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సిఐ శేషగిరిరావు

నిబంధనలు పాటించకుంటే చర్యలు

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ఆటో డ్రైవర్లు స్వచ్ఛందంగా సహకరించాలని ఒకటవ పట్టణ సీఐ శేషగిరిరావు కోరారు. సీఐగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఆయన శనివారం ఆటో డ్రైవర్ల అందరికీ కౌన్సిలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన కల్పించారు. నిర్ణయించిన పాయింట్లలోనే ఆటోలు నిలుపు కోవాలని అన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలు చేర్చడంతో పాటు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని అన్నారు. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గంటా అనిల్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి - పర్చూరు

పద్మభాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాగులపాలెం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల 2022-23విద్యాసంవత్సరంలో 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినులు చెరుకూరుకు చెందిన కె సుస్మితకు రూ.5వేలు, షేక్ షబీనాకు రూ.4వేలు, నాగులపాలెంకు చెందిన సిహెచ్ రిషితకు రూ.3వేలు ప్రదమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు ప్రిన్సిపాల్ పి విశ్వరాణి అధ్యక్షతన శనివారం శనివారం జరిగిన సభలో అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ గంటా అనిల్‌కుమార్, ఎంఇఒ పి వెంకట్రామయ్య, మాజీ జెడ్‌పిటిసి కొల్లా సుభాష్, వైఆర్ హైస్కూల్ హెచ్ఎం ఇ రాజశేఖర్, బెంజిమన్‌హనోక్ పాల్గొన్నారు.

వెంకటేష్‌ను పరామర్శిస్తున్న వైసిపి నేతలు

వెంకటేష్‌కు వైసిపి నేతల పరామర్శ

ప్రజశక్తి - చీరాల

హైదరాబాద్ యశోధ చికిత్స అనంతరం హైదరాబాద్ బంజారాహిల్స్ లోని ఆయన ఇంటి ఉన్న వైసిపి ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబును వైసిపి జిల్లా కార్యదర్శి శిఖా సురేష్, కో-ఆప్షన్ సభ్యులు షేక్ కబీర్, షేక్ సుభాని, మేరుగ ఇస్సాకు శనివారం పరామర్శించారు.

జోరువానలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - పంగులూరు

టిడిపి పాలనతోనే ప్రజలకు భవిష్యత్తు ఉంటుందని ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. మండలంలోని కొండమంజులూరులో బాబు షఉ్యరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని శనివారం రాత్రి జోరు వానలో సైతం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే అమలుచేసే గ్యారెంటీ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. మహిళలకు మహాశక్తి, రైతులకు అన్నదాత, యువకులకు యువగళం, బీసీలకు రక్షణ చట్టం, ఇంటింటికి రక్షిత మంచి నీటి పథకంతో పాటు పూర్ టు రిచ్ కార్యక్రమాలు అమలుచేస్తామని అన్నారు. గత నాలుగేళ్లుగా ప్రజలు వివిధ సమస్యలతో బాధపడుతున్నారని అన్నారు. ప్రజల సమస్యలను వైసీపీ గాలికి వదిలేసిందని అన్నారు. సంక్షేమం పేరుతో ఒక చేత్తో రూ.10ఇస్తూ మరొక చేత్తో రూ.100పన్నుల రూపంలో ప్రజల వద్ద పిండుతున్నాడని అన్నారు. దళిత యువకుల్ని చంపడం, శిరోముండనాలు చేయడం, దళిత మహిళల్ని హత్యాచారాలతో బలి తీసుకోవడమే జగన్‌రెడ్డి దళిత సమాజానికి చేసిన మంచి పనా అని ప్రశ్నించారు? తాజాగా ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల అంబేద్కర్ కాలనీకి చెందిన దళిత యువకుడు కాండ్రు శ్యామ్ కుమార్‌ను కొందరు శాడిస్టులు నిర్బంధించి నాలుగు గంటలపాటు

వర్షంలో గొడుగు పట్టుకుని ఇంటింటికీ తిరుగుతున్న రవి

చిత్రహింసల పెట్టడమే కాకుండా దాహంవేసి మంచినీళ్లు అడిగితే మూత్రం పోసి అవమానించారని అన్నారు. జగన్ పాలనలో దళితులపై దాడులు పరాకాష్టకు చేరాయని అన్నారు. విదేశీ విద్య పథకానికి అంబేద్కర్ పేరు తొలగించి జగన్‌పేరు పెట్టుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఆ పథకాన్ని కూడా నాలుగేళ్లు అమలు చేయలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలం మాజీ అధ్యక్షులు చింతల సహదేవుడు, కుక్కపల్లి ఏడుకొండలు, మాజీ జెడ్పిటిసి కర్రీ వెంకట సుబ్బారావు, బొప్పూడినాగేశ్వరరావు, కశ్యాపురం గ్రామ టిడిపి అధ్యక్షులు దూళిపాళ్ల రాజేష్, తెలగతోటి రాధాకృష్ణమూర్తి, కల్లూరి కోటయ్య, బత్తుల వెంకట్రావు పాల్గొన్నారు.

బాపట్ల : నియోజకవర్గంలో రెండు దశాబ్దాల టిడిపి చరిత్రను తిరగరాసేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారని టిడిపి ఇన్చార్జి వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో ఆయన పట్టణంలోని ఎమ్మెస్సార్ కళ్యాణ మండపం వద్ద నుండి 3వ వార్డులో శనివారం నిర్వహించారు. ప్రతి మహిళకు చీర, సంచి అందించారు. ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. గత 20ఏళ్లుగా బాపట్లలో టిడిపికి ఎదురు దెబ్బ తగులుతూనే ఉందని అన్నారు. వైసీపీ పాలనపై ప్రజలు విసిగి వేసారి ఉన్నారని అన్నారు. అరాచక పాలనను అంతమొందించేందుకు ప్రజలు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చీరాల : రాబోయే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపాలని టిడిపి ఇన్చార్జి ఎం ఎం కొండయ్య కోరారు. బాబు షఉరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను మండలంలోని రామకృష్ణాపురంలో శనివారం పంపిణీ చేశారు. ఇంటింటికి తిరిగి ప్రజల సాధక బాధలు తెలుసుకుంటూ కరపత్రాలు పంచారు. టిడిపి అధికారానికి వస్తే అమలు చేయబోయే మ్యానిఫెస్టోలోని అంశాలను స్థానికులకు వివరించారు. ఆడబిడ్డ నిధి కింద 18సంవత్సరాలు దాటిన మహిళలకు నెలకు రూ.1500 అందిస్తామని తెలిపారు. ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత నీటి సరఫరా చేస్తామన్నారు. రైతుకు ఏడాదికి రూ.20వేలు ఆర్థిక సహాయం, యువగళం నిధి కింద నిరుద్యోగికి నెలకు రు.3వేలు, బీసీలకు రక్షణ చట్టం వంటి హామీలు వివరించారు. ఒక్కఛాన్స్ జగన్‌కు ఇస్తే రాష్ట్రం అద్వాన్నమైందని, మరోసారి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో నాతాని ఉమామ హేశ్వరరావు, యాసిన్, నాసిక వీరభద్రయ్య, పిచ్చుక వెంకట సుబ్బారావు, ఎస్‌కె బాబు, నల్లమోలు భాస్కర్, అజయ్ కుమార్, ఘోష్, మల్లేశ్వరరావు, తేలబోలు నాగేశ్వరరావు, ఉసురుపాటి సురేష్, వంక హరికృష్ణ, లావేటి శ్రీనివాసతేజ, అయూబ్ పటాన్, దుడ్డు శామ్యూల్ పాల్గొన్నారు.

ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో వేగేశన నరేంద్రవర్మ

కరపత్రాలు పంపిణీ చేస్తున్న చీరాల ఇన్‌ఛార్జి కొండయ్య

4, 5 తేదీల్లో ఓటర్ల ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి -రేపల్లె

డి మల్లిఖార్జునరావు

ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్)లో భాగంగా ఈనెల 4, 5తేదీల్లో పోలింగ్ కేంద్ర స్థాయిలో నిర్వహించే ఓటర్ల ప్రత్యేక శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు డి మల్లికార్జునరావు కోరారు. ఓటర్ల శిబిరంలో ఆయన విలేకరులతో శనివారం మాట్లాడారు. ఓటరు జాబితాలకు సంబంధించిన సమాచారం ఓటర్ల ఇంటి ముంగిటకు తీసుకెళ్లే ప్రక్రియ అన్నారు. ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రం అధికారి (బీఎల్వో) తమకు కేటాయించిన కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారని అన్నారు. ఓటర్లు అక్కడికెళ్లి జాబితాలో పేరు ఉన్నదీ లేనిదీ పరిశీలిం చుకోవాలని కోరారు. శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అర్హత గల ఓటర్లు వారి పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేవో సరి చూసుకోవాలని అన్నారు. అవసరమైతే ఫారం-6, 7, 8ఓటు నమోదు, మార్పు, చేర్పులకు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు.

వాటర్ ట్యాంకుకు పునాది పనుల పర్యవేక్షిస్తున్న ఇఇ

ఫౌండేషన్ రాఫ్ట్ స్టీల్ పరిశీలన

ప్రజాశక్తి - వేటపాలెం

వాటర్ ట్యాంక్ నిర్మాణంలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈఈ చింతా విద్యాసాగర్ అన్నారు. మండలంలోని చల్లారెడ్డిపాలెం పంచాయితీ కొణిజేటి చేనేతపురి కాలనీలో వాటర్ ట్యాంక్ ఫౌండేషన్ రాఫ్ట్ స్టీల్ రాడ్స్ ను ఆయన శనివారం పరిశీలించారు. పుట్టింగ్ గ్యాప్‌లను ప్లాన్‌లో ఉన్న ఎంఎం సైజులను పెట్టిన ఇనుప సువ్వలను పరిశీలించారు. అనుకున్న టైంలో వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తయ్యే విధంగా చూడాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కొనిజేటి చేనేతపురి నందు రూ.93లక్షలు, చేనేతపురి కాలనీ నందు రూ.82లక్షలతో ఇంటింటికి శాశ్వత కుళాయి జల జీవన్ మిషన్ క్రింద నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్డబ్ల్యూఎస్ డిఈఎస్ సతీష్ చంద్ర, ఎఈ రాంకుమార్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ అప్సర ఉన్నారు.

దేవాంగపురిలో అన్నం వడ్డిస్తున్న రోటరీ ప్రతినిధులు

రోటరీ ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని దేవాంగపురిలో గంగా భ్రమరాంబ సమేత నాగలింగేశ్వర స్వామి ఆలయంలో వేటపాలెం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం చేశారు. రోటరీ అధ్యక్షులు బట్ట మోహనరావు మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమం 37వ రోజుకు చేరిందని అన్నారు. అన్నదానంకు సహకరిస్తున్న రోటరీ సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి ఎవి సురేష్ బాబు, రోటరీ సభ్యులు బండారు రాజేష్, గుత్తి పరంజ్యోతి, సప్రం రోహిణి కుమార్ పాల్గొన్నారు.

కోల్డింగ్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వేమూరు నియోజకవర్గంలో భట్టిప్రోలులో శనివారం కోల్డింగ్ సంస్థ ఆధ్వర్యంలో ఫోకస్ కంటి వైద్యశాల సహకారంతో స్థానిక జ్యోతి హెల్త్ కేర్ సెంటర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 450మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 25మందికి కంటి శుక్లాలు ఉన్నట్లు గుర్తించారు. అలాగే 375మందికి ఉచితంగా మందులు, కళ్ళజోళ్ళు అందజేశారు. వైద్యశిభిరాన్ని బట్టిప్రోలు ఫాదర్ రవికుమార్, ఫాదర్ మార్టిన్ ప్రారంభించారు. కార్యక్రమంలో కోల్డింగ్స్ సంస్థ డైరెక్టర్ ఫాదర్ జి అబ్రహం, స్థానిక కోఆర్డినేటర్ ఎస్ రాజేష్, సిస్టర్ రిజి, ఎస్తేరు, డేవిడ్, బాబ్జి, సోఫియా, వెంకటరత్నం, నన్నేపాముల నాగేశ్వరరావు, యేసు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వైసిపి నాయకులు

- దేశం తీర్థం పుచ్చుకున్న మాజీ ఎంపీపీ యోహాను

ప్రజాశక్తి - బాపట్ల

వైసీపీ అధికారం చేపట్టినప్పటి నుండి ఉన్మాదిలా పాలన కొనసాగిస్తున్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అరాచకాలను భరించలేక వైసిపి నాయకులు టిడిపిలో చేరినట్లు టిడిపి ఇన్‌ఛార్జి వేగేసేన నరేంద్ర వర్మ అన్నారు. మాజీ ఎంపిపి ప్యార్లి యోహాను ఆధ్వర్యంలో 60మంది వైసిపి అనుచరులతో నరేంద్రవర్మ సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా నరేంద్ర వర్మ మాట్లాడుతూ ఎక్కడ చూసినా వైసిపి నేతలు విధ్వంసకర పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అరాచకం సృష్టిస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలుపు దిశగా రాష్ట్రంలో ప్రభంజనం సృష్టిస్తుందని అన్నారు. టిడిపి మరింత బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తానికొండ దయాబాబు, నక్కల వెంకటస్వామి, షేక్ ఫరీద్ మస్తాన్, గోలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, గుడిపల్లి సాంబశివరావు, మందపాటి ఆంధ్రియ, ఇనగంటి గాంధీ, యమ్ నాగరాజు, మాధవ్, మంచాల సుబ్బారావు, చింతపల్లి చిట్టిబాబు, పేరాల పెద్ద వెంకటేశ్వర్లు, చింతపల్లి యాకోబు, రుద్రపాటి ఇస్సాకు, చింతపల్లి సురేష్, కుమ్మరి ఏసోబు, మత్తే జయరాజు, బేతాళ సందీప్, పేరాల కౌశిక్ బాబు, కర్ణపూడి దేవదాసు, చింతపల్లి రాజేష్, మంచాల ప్రవీణ్ తేజ పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన కార్యకర్తలు, మాజీ ఎంపిపి యోహాను

కరువు మండలంగా ప్రకటించాలి

ప్రజాశక్తి - సంతమాగులూరు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పంటలు ఎండుతున్న మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని కామేపల్లిలో టిడిపి నాయకులు గమిడి బుచ్చయ్య దశదిన కార్యక్రమానికి హాజరయ్యారు. బుచ్చయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి ఖరీఫ్ సీజన్లో అనుకూలమైన వర్షపాతం లేకపోవడంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని చెప్పారు. సాగునీరు లేక నిలువునా పైర్లు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 400మండలాలకుపైగా కరువు పరిస్థితులు ఉంటే రాష్ట్ర ప్రభుత్వం కేవలం 103మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం రైతులను మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరువుకు గురైన అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 56మండలాలకు గాను 40మండలాలకుపైగా తీవ్రమైన కరువు పరిస్థితులు ఉన్నాయని అన్నారు. అద్దంకి, కొరిశపాడు, బల్లికురవ, సంతమాగులూరు, పంగులూరు, పర్చూరు, మార్టూరు మండలాల్లో తీవ్ర వర్షా బావ పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. కేవలం 20రోజుల్లో మొక్కుబడిగా కరువు మండలాలను ప్రకటించడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గాడిపర్తి వెంకటరావు, గుండపునేని సురేష్, కొనికి శ్రీనివాసరావు, శ్రీరామమూర్తి, జిర్రా బాబురావు, గుండపునేని సత్యం పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్

గృహనిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న ఎంపిడిఒ లక్ష్మినారాయణ

ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలి

ప్రజాశక్తి - కారంచేడు

గృహ నిర్మాణ లబ్ధిదారులు త్వరగా నిర్మించుకోవాలని కారంచేడు ఇంచార్జి ఎంపీడీఒ లక్ష్మీనారాయణ లబ్దిదారులకు సూచించారు. హౌసింగ్ డే సందర్భంగా కారంచేడు-3వ సచివాలయం పరిధిలోని అంబేద్కర్ కాలనీలో లబ్దిదారులతో ఆయన మాట్లాడారు. గృహ నిర్మాణాలను చేసుకోవడంలో పురోగతి సాధించాలని కోరారు. సచివాలయంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ ఇన్స్‌పెక్షన్ యాప్ నందు ప్రతి రోజు ఇళ్ళను సందర్శించి యాప్ నందు అప్లోడ్ చేయాలని చెప్పారు. నాడు-నేడు పాఠశాలలను తనిఖీ చేశారు. ఆరోగ్య శ్రీ యాప్‌ను ఇన్స్టాల్ చేప్పించి నూరు శాతం పూర్తీ చేయాలని ఏఎన్ఎంలకు, వాలంటీర్లుకు అదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఇన్స్‌పెక్టర్ ఎస్‌కె ఖసీం సాహెబ్, జూనియర్ అసిస్టెంట్ వై డానియెల్ ప్రసాద్ పాల్గొన్నారు.

భూపంపిణీ కోసం సిద్ధమవ్వాలి

కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

భూపంపిణీ కోసం సంబంధిత దస్త్రాలు, భూమి హక్కు పత్రాలను అధికారులు సిద్ధం చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. డివిజన్, అన్ని మండల స్థాయి అధికారులతో కలెక్టరేట్ నుంచి శనివారం ఆయన పలు అభివద్ధి కార్యక్రమాలపై వీక్షణ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అసైన్డ్ భూములు, లంక గ్రామాలలో భూములు, ఎల్.పి.సి. కింద భూములు, స్మశానవాటిక భూములకు హక్కు పత్రాలను ఈనెల 15వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తారని తెలిపారు. పట్టాలు ముద్రించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్సీ కార్పొరేషన్ కింద పంపిణీ చేసిన భూములకు హక్కు పత్రాలు ఇవ్వాల్సి ఉందన్నారు. 47 గ్రామాలకు స్మశాన భూములు కేటాయింపులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలను గడువులోగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలపై అధికారులు దష్టి సారించాలన్నారు. ఈనెల 5వ తేదీలోగా నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవాలని ఆయన సూచించారు. ఇంకొల్లు మండలంలో చేపట్టిన నిర్మాణ పనుల్లో జాప్యంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్న కాలనీలలోని పక్కా గహాల నిర్మాణ పనులలో లక్ష్యాలు చేరుకోవాలని కలెక్టర్ తెలిపారు. కొల్లూరు, వేమూరు, అమర్తలూరు, చండూరు మండలాలలో పురోగతి లేకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. లక్ష్యాలు ఎందుకు చేరుకోవడం లేదని అధికారులను నిలదీశారు. ఇంకుడు గుంతల నిర్మాణంలో 33 శాతం పురోగతి దాటకపోవడం ఏమిటని మండలాల వారిగా అధికారులను ప్రశ్నించారు. భూముల రీ సర్వే ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జి. ఆర్. సర్వే నివేదికను వాలంటీర్లు ఆన్ లైన్ లో సరిగా నమోదు చేయడం లేదని చెప్పారు. అధికారులు పర్యవేక్షణ మరింత పెరగాలని, వాలంటీర్లకు అవగాహన కల్పించాలన్నారు.

సంక్షిప్త ఓటర్ల సవరణ జాబితా ప్రక్రియ రూపొందించడంలో నిర్లిప్తత ఉండరాదని కలెక్టర్ హెచ్చరించారు. పర్చూరు నియోజకవర్గంలో దరఖాస్తుల విచారణ పూర్తయినప్పటికీ ఆన్ లైన్ లో నిక్షిప్తం చేయడంలో జాప్యంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, అనుబంధ శాఖల అధికారులు, ఆర్‌ఓలు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌వోలు, అనుబంధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కరువు దరువు..

కరువును గుర్తింపే కరువైంది. జిల్లాలో తీవ్ర దుర్భిక్షం కొనసాగుతోంది. ఖరీఫ్‌తో పాటు రబీకి వర్షాభావం ఆటంకంగా మారింది. అయితే రాష్ట్రప్రభుత్వం కరువు మండలాల గుర్తింపులో జిల్లాను పూర్తిగా పక్కనబెట్టేశారు.కనీసం అధికారులు పంపిన ప్రతిపాదనలను కూడా పట్టించుకోలేదు.38 మండలాలను గానూ 28 మండలాల్లో బాగాలోటు వర్షపాతం నమోదైంది.పంటల సాగు కూడా ప్రశ్నార్థకంగా మారింది. వేసిన పంటలు కూడా ఎండుముఖం పట్టాయి.ఖరీఫ్ పంటలే 50వేల ఎకరాల్లో చేతికందే పరిస్థితి లేదని వ్యవసాయశాఖ గుర్తించింది.రబీలోనూ అయోమయం నెలకొంది.వర్షాభావం వెంటాడుతోంది. పొగాకు, శనగ సాగుపైనా ఆశలు కనిపించడం లేదు. నాట్లు వేయడానికి కూడా ఎక్కడా నీళ్లు లేవు.పొలాలన్నీ దున్నిపెట్టారు.వర్షంకురిస్తే విత్తనాలు, నాట్లు వేయడానికి సిద్ధంగా ఉన్నారు. జిల్లా అంతటా ఇదే పరిస్థితి.ఈపాటికే వేసిన పైర్లు ఎండుతుంటే రబీలోసాగుకావాల్సిన పైర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.ఈ పరిస్థితుల్లో జిల్లాలో కరువు ఉన్నట్లు కూడా పాలకులకు కనిపించడంలేదు. కరువును ప్రకటించడానికే సాహసించడంలేదు. ఎందుకంటే కరువు కింద మండలాలను ఖరారు చేస్తే సహాయక చర్యలు చేపట్టాల్సి ఉంది. రుణాలు వాయిదాలు, విత్త నాలు సబ్సిడీపై ఇవ్వడం, పరిహా రాలు వంటివి ఉన్నాయి.ఇవన్నీ ఖర్చు తో కూడుకున్నవనే భావనతో రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలపై పెద్ద గా దృష్టిసారించలేదు. కరువు ఉందని చెప్పడానికి కూడా వెనుకాడుతోంది. ఎన్నికలు కూడా వస్తున్నందున కరువు ఉందని చెబితే నష్టం జరుగు తుందనే ఆలోచనలో ఉన్నారు.అంతా బాగుందనే భ్రమల్లో పాలకులు ఉండటమే కాకుండా కష్టాల్లో ఉన్నవారిని కూడా అదే దృష్టితో చూస్తే పరిస్థితులు, పరిణామాలు ఎలా ఉంటాయో ఆలోచించాల్సిన అవసరంఉంది.

నకిలీ స్టాంపులతో సాగుతోన్న భూ కుంభకోణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఒంగోలుతోపాటు కనిగిరి, మార్కాపురం తదితర పట్టణాల్లో ఈ కుంభకోణాలు భారీగానే ఉన్నాయి.పిర్యాదులు పెరుగుతున్నాయి. నకిలీపత్రాలతో భూవివాదాలు అటు అధికారయంత్రాంగానికి కూడా సవా లుగా మారాయి.కొందరు కబ్జాదారులు చేస్తున్న పనులకు భూముల యజ మానులకు నిద్రలేకుండా గడుపుతున్నారు.అధికారులచుట్టూ తిరుగుతు న్నారు. పాలకపక్ష నేతల వద్దకు తిరిగీ తిరిగివిసిగిపోయారు. ఇపుడు సిట్ ఏర్పాటుతో బాధితులకు పిర్యాదుచేసేందుకు మార్గం దొరికింది. ఇప్పటికే అందిన పిర్యాదుల ఆధారంగా పోలీసులు కేసులు నమోదు చేశారు.572 డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు.వాటిల్లో 72 డాక్యుమెంట్లు నకిలీవిగా గుర్తించారు.78 మంది నిందితులను గుర్తించారు.38 మందిని అరెస్టు చేశారు. ఇంకా 40 మందికోసం గాలింపు చర్యలు చేపట్టారు.కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మల్లికాగర్గిక్‌లు ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. నిందితులు ఎవరైనా వదిలిపెట్టేది లేదని ప్రకటిం చారు. అయితే ఈకేసులో పెద్దపెద్ద నేరస్తులను ఇంకా అరెస్టులు చేయలేదనే చర్చ సాగుతోంది. రాజకీయంగా బలమున్నవారి జోలికి వెళతారా?లేదా?అనేదీ చూడాలి.ఒంగోలు పట్టణంతోపాటు కనిగిరి, మార్కాపురంలోనే ఈ కుంభకోణాలు అధికంగా ఉన్నాయి. ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జాచేసేస్తున్నారు. అక్రమార్కులకు అధికారులు అన్ని రకాలుగా అండదండలు అందించారనే ఆరోపణలూ ఉన్నాయి. బాధితులు పిర్యా దులు చేస్తే ఏ కేసులోనూ పోలీసులుగానీ, రెవెన్యూ యంత్రాంగం గానీ, రిజిస్ట్రేషన్ శాఖల్లోగానీ ఎక్కడా సానుకూలంగా స్పం దించలేదు. కబ్జా దారులకే సహకరించారు. ఏదో ఒక నకిలీపత్రం అడ్డుపెట్టుకుని రిజిస్ట్రేషన్‌కు వెళితే నిజంగా హక్కుదారులు ఎవరు? అనేది చూడకుండానే రిజిస్ట్రేషన్లు చేశారు.ఈ వ్యవహారంలో భారీగా చేతులు మారాయి. రిజిస్ట్రేషన్‌శాఖలోనే నకిలీపత్రాలను అడ్డుపెట్టుకుని రిజిస్ట్రే షన్లు చేసుకున్నారు. ఇక్కడే భూకుంభకోణాలకు బీజం పడింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ కుంభకోణాలకు మూలమైన అంశాలపై దృష్టిసారించాలి. ప్రజల ఆస్తులకు భద్రత కల్పించే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో రాజకీయ వేడిపెరుగుతోంది. మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది.దీంతో నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల నడుమ రాజకీయవాతావరణం రోజురోజుకూ వేడెక్కుతోంది. నిన్నటి వరకూ చంద్రబాబు అరెస్టుపై నిరసన ఉద్యమాలతో బిజీగా ఉన్న తెలుగుదేశంపార్టీ ఇపుడు పార్టీ కార్యక్రమాలను తీసుకుని ముందుకు సాగుతున్నారు. ఎన్నికల ప్రచారం మొదలైనట్లుగా వాతావరణం కనిపిస్తోంది. మరోవైపు పాలకపక్ష నేతలు కూడా నియోజకవర్గాల్లో వివిధ కార్యక్రమాల పేరుతో తిరుగుతున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు,శిలాఫలకాలతో హడావిడిగానే ఉన్నారు, ప్రజల ఎజండాగా కన్నా ఎన్నికల ఎజండానే కీలకంగా ఈ పార్టీల్లో కనిపిస్తోంది.ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం నిత్యకృత్యమైంది. సిపిఎం ప్రజారక్షణభేరి పేరుతో బస్సుయాత్రలు చేపట్టింది.ఈ నెల7న ఆపార్టీ చేపట్టిన బస్సుయాత్ర జిల్లాలోకి ప్రవేశించనుంది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ జిల్లాలో పర్యటించారు. మార్కాపురంలో కృష్ణాజలాల సాధనపై జరిగిన రైతుసదస్సులో ఆయన పాల్గొన్నారు.కృష్ణాజలాల కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఓటర్ల జాబితాలో తప్పులపై విచారణ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ఓటర్ల జాబితాలో తప్పులపై విచారించి.. నివేదిక ఇవ్వాలని మార్కాపురం తహశీల్దార్‌ను సబ్‌కలెక్టర్ ఆదేశించారు. ప్రజాశక్తి టాబ్లాయిడ్ లో 'చనిపోయినా..ఓటు పోదా..' శనివారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మార్కాపురం సబ్ కలెక్టర్, ఈఆర్‌ఓ మాధవన్ విచారణ జరిపించి.. పూర్తి నివేదికను త్వరిత గతిన అందించాలని మార్కాపురం తహశీల్దార్ డి.మంజునాథరెడ్డిని ఆదేశించారు. దీంతో తహశీల్దార్ మతులు, బోగస్ ఓట్లు, డబుల్ ఎంట్రీలను లిస్ట్ అవుట్ చేసి ఆయా ఇళ్లకు వెళ్లి సమగ్ర విచారణ చేపట్టాల్సిందిగా బీఎల్‌ఓ లను ఆదేశించడంతో 37, 38 పోలింగ్ కేంద్రాలకు చెందిన బిఎల్వోలు మతులు, డబుల్ డబుల్ ఎంట్రీ ఓట్లు, బోగస్ ఓట్లు కలిగి ఉన్న వ్యక్తులు, ఇంటి నెంబర్లపై శనివారం సాయంత్రం

నిబంధనలు అతిక్రమించి

బాణసంచా విక్రయిస్తే చర్యలు

- ఎస్‌పి మలికగర్గ్ వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దీపావళి పండుగ నేపథ్యంలో నిబంధనలను అతిక్రమించి టపాసులు విక్రయించినా, నిల్వ ఉంచినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి మలిక గర్గ్ తెలిపారు. జిల్లాలో బాణసంచా తయారీ లేదా విక్రయాలు లైసెన్సు కలిగిన వారు ప్రభుత్వ నియమనిబంధలనకు లోబడి ఉండాలని, బాణసంచా, పేలుడు పదార్థాలు ఇంటిలో నిల్వ ఉంచరాదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసుకొని విక్రయించుకోవాలని, షాపుల వద్ద మండే స్వభావం కల్గిన వస్తువులు ఉంచరాదన్నారు. నీరు, ఇసుక, వంటి అగ్ని మాపక సామాగ్రిని తప్పనిసరిగా సిద్ధంగా ఉంచుకోవాలని, బాణసంచా దుకాణాలకు దూరంలో వాహనాలను నిలుపు కునేలా చూసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లం ఘన జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో అక్రమంగా తయారయ్యే టపాసులు, సరఫరా, విక్రయాలు చేసే వారిపై వారిపై నిఘా ఉంచాలని, గతంలో బాణాసంచా సంబంధించిన కేసుల్లోని పాత ముద్దాయిలను బైండోవర్ చేయాలన్నారు. నిరంతర తనిఖీలు నిర్వహించి దుకాణాల వద్ద భద్రతా చర్యలను ఎప్పటికపుడు పరిశీలన చేయాలన్నారు. ముందస్తు జాగ్రత్తలతో ప్రమాదాలను నివారించగలమని అధికారులకు ఎస్‌పి సూచించారు. దీపావళి పర్వదినాన్ని జిల్లా ప్రజలు అందరూ ఆనందంగా జరుపుకోవాలని, సాధ్యమైనంతవరకు కాలుష్య రహిత టపాసులనే కాల్చాలన్నారు. టపాసులు కాల్చే సమయంలో కాటన్ దుస్తులు ధరించాలని, సిల్క్ వస్త్రాలు ధరించవద్దని సూచించారు. ముఖ్యంగా పిల్లలు పట్ల అప్రమత్తంగా ఉండాలని, పిల్లలు టపాసులు కాల్చే సమయంలో పెద్దల పర్యవేక్షణ ఉండాలని ఆమె సూచించారు. జిల్లాలో ఎక్కడైనా బాణసంచా అక్రమ విక్రయాలు, నిల్వల సమాచారాన్ని ఉంటే పోలీస్ డయల్ 112 లేదా పోలీస్ వాట్సాప్ నెంబర్ 9121102266 ద్వారా పోలీసులకు తెలియచేయా లన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్‌పి తెలియజేశారు.

ప్రకాశాన్ని కరువు జిల్లాగా ప్రకటించాలి

- కరువుతో తీవ్రంగా నష్టపోయిన రైతన్నలు
- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రకాశం జిల్లా అంతటా కరువు తీవ్రంగా ఉందని, పశ్చిమ ప్రకాశంలో కరువు విలయ తాండవం చేస్తోందని, ఫలితంగా సాగు చేసిన పంటలన్నీ ఎండిపోయాయని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకాశంను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదు నెలల కాలంలో నాలుగు నెలలు లోటు వర్షపాతం నమోదు కావడం జరిగిందన్నారు. వర్షం లేకపోవడంతో పశ్చిమ ప్రకాశంలో ఏ పంటా చేతికి అందే పరిస్థితి లేదన్నారు. తూర్పు ప్రకాశంలోనూ సాగర్ కాలువ ద్వారా నీరు పంటలకు విడుదల చేయలేమని ప్రభుత్వం చెప్పడంతో సాగు భూమి అంతా బీడుగా ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా సాగు విస్తీర్ణం కూడా తగ్గిందని అధికారుల లెక్కలు చెబుతున్నాయన్నారు. సాగు 80 శాతం మేర జరిగిందని, అందులో ఈ పాటికే 40 శాతంపైగా ఎండిపోవడం జరిగిందన్నారు. మిర్చి, పత్తి, కంది, జొన్న, మినుము పంటలన్నీ దెబ్బతిన్నట్లు చెప్పారు. ఖరీఫ్‌లో సాగుబడిలో ఉన్న 80వేల ఎకరాలు ఎండిపోవడం జరిగిందన్నారు. ఒక్కో రైతు మిరప పంటపై ఎకరానికి రూ. లక్ష వరకు ఖర్చు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో 330 మండలాల్లో కరువు ఉన్నట్లు అధికారులు గుర్తించినా ప్రభుత్వం మాత్రం 103 మండలాలను మాత్రమే గుర్తించారన్నారు. అందులో ప్రకాశంలో ఏ మండలం లేదన్నారు. ఇంతటి దారుణ పరిస్థితులు కళ్లెదుటే కనబడుతున్నా ఈ ప్రాంత మంత్రులు, ఎమ్మెల్యేలు రైతుల పట్ల చిత్తశుద్ధి చూపకపోవడం దారుణమన్నారు. కనీసం మంత్రివర్గ సమావేశంలోనూ కరువుపై చర్చ జరగకపోవడం బాధాకరమన్నారు. సెప్టెంబర్‌లో ఖరీఫ్‌లు సాగు చేసి దెబ్బతిన్న పంటలన్నీ అంచనా వేసి అక్టోబరు నెలాఖరుకు కరవు నివేదిక పంపాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఆ పని చేయలేదన్నారు. రైతులకు సాయం చేయాలనే గుణం ప్రభుత్వాని లేకనే కరవు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గ్రామాల్లో కనీసం తాగునీటికి సైతం ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. మూగ జీవాలకు దాహం తీర్చేందుకు నీరు లేదన్నారు. గతంలో ఎన్నడూ ఇంతటి భయంకర కరవు చూడలేదన్నారు. రైతులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు రీ షెడ్యూలు చేయాలన్నారు. తక్షణమే రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాల న్నారు. పంట నష్టాలు అంచనా వేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కరవుతో రైతన్నలకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వ సాయంతో పూడ్చాలని కోరుతూ ఈ నెల 6వ తేదీన మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట, కనిగిరి ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతున్నట్లు చెప్పారు. విలేకరుల సమావేశంలో సిపిఎం నాయకులు డి.సోమయ్య, గుమ్మా బాలనాగయ్య, డికెఎం రఫీ, రైతు నాయకులు గంగిరెడ్డి రాజశేఖరరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జె.నాగరాజు, రేపని తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి